

# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట




# ఎవరిది..?

## అంతటా అదే చర్చ..

- మహబూబ్‌నగర్ నూతన కార్పొరేషన్‌గా ఏర్పాటు
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పార్టీలు
- అధికార పార్టీకి మ్యాజిక్ ఫిగర్ వస్తుందా..?
- బిఆర్ఎస్, బిజెపి కలిస్తే లెక్క సరిపోతుందా..?
- రసవత్తరంగా పాలమూరు రాజకీయాలు



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి12 ప్రభాత వార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 18 మున్సిపాలిటీలతో పాటు మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌కు బుధవారం ఎన్నికలు ప్రశాంతంగా ముగియగా నేడు కౌంటింగ్ ప్రక్రియ కొనసాగ నుంది. ఏ మున్సిపాలిటీలో ఎవరు నెగ్గుతారు, ఎవరు తగ్గుతారు చైర్మన్లుగా ఎవరు నిలబడ తారు అనే చర్చ అన్ని మున్సిపాలిటీలోనూ జరుగుతున్నదే. మహబూబ్‌నగర్ నూతన కార్పొరేషన్‌గా ఏర్పాటు కావడంతో అందరి దృష్టి అక్కడే ఉంది. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులే తాము 32,34 స్థానాల్లో గెలుపొందుతాం అని చెబుతుంటే అసలు 30 సీట్లు దాటుతాయా అనే మరో చర్చకు దారితీసింది. ఈ క్రమంలో ప్రధాన ప్రతిపక్షం అయిన బిఆర్ఎస్ కు 15 నుంచి 20 స్థానాలు వస్తాయంటూ,బిజెపికి పది సీట్లకు పైగా వస్తాయని ప్రచారం జరుగుతున్నది. కాంగ్రెస్ పార్టీకి 30కి పైగా సీట్లు వస్తే ఎలాంటి ఇబ్బంది లేదు ఏసమస్య రాదు..అసలు సమస్య రాకుంటేనే.. ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ తమదే మేయర్ పీఠం అంటూ ధీమాతో ఉండగా బిజెపి సైతం ఎక్కడా తగ్గడం లేదు. ఎవరు గెలుస్తారు ఎవరు ఓడుతారు ఎవరికి మేయర్ పీఠం వరిస్తుంది అని తెలియాలంటే మరికొన్ని గంటలు కాదు కాదు కాదు రోజులు వేచి చూడాలేమో..?

**కీలక నేతల భవితవ్యం..?**

మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు మారేపల్లి సురేందర్ రెడ్డి, ఎన్.పి.వెంకటేష్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, సిరాజ్ ఖాద్రి ఇలాంటి అధికార పార్టీ కాంగ్రెస్ ప్రముఖ నేతలు కార్పొరేటర్ బరిలో నిలిచారు. కీలక నేతలు అంతా మేయర్, డిప్యూటీ మేయర్ పీఠంపై గురి వేసి ఉన్నవారే. ఇది ఇలా ఉండగా అసలు ఎవరు గెలుస్తారు ఎవరు ఓడుతారు అనే భయం ఇంకా కొంతమంది నేతల్లో ఉండడం గమనార్హం. సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా కావడం మరింత ఉత్కంఠకు చర్చకు దారి తీస్తున్న విషయం. మేయర్ పీఠం ఎవరు ఊహించని వారు అవుతారని పట్టణంలో మరో చర్చ జరగడం కొందరి లో ఆందోళన కలిగిస్తున్న అంశం.

# ఓట్ల లెక్కింపు పారదర్శకంగా నిర్వహించాలి

- అభ్యంతరాలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురండి
- అధికారులు సమన్వయంతో వ్యవహరించాలి
- మాక్ కౌంటింగ్ ద్వారా కౌంటింగ్ సిబ్బందికి దిశా నిర్దేశం చేసిన కలెక్టర్ విజయేంద్ర బోయి



అధికారులకు సూచనలు జారీ చేస్తున్న కలెక్టర్



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** జిల్లాలో ఫిబ్రవరి 13న నిర్వహించనున్న రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించిన కౌంటింగ్ సిబ్బందికి ఓట్ల లెక్కింపు ప్రక్రియపై గురువారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో మాక్ కౌంటింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ముఖ్య అతిథిగా పాల్గొని, కౌంటింగ్ సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు కౌంటింగ్ సూపర్వైజర్లకు, కౌంటింగ్ అసిస్టెంట్లకు మాక్ ఓట్ల లెక్కింపు శిక్షణ తరగతులు నిర్వహించి వారికి ఓట్ల లెక్కింపు ప్రక్రియ పై పూర్తి అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,కౌంటింగ్ సిబ్బంది ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహనతో విధులు నిర్వహించాలని, వార్డు వారీగాఓట్ల లెక్కింపు క్రమబద్ధంగా జరిగేలా జాగ్రత్తలుతీసుకోవాలని సూచించారు.పాలమూరు విశ్వవిద్యాలయంలో మహబూబ్‌నగర్ కార్పొరేషన్, భూత్పూర్,దేవరకద్ర మున్సిపాలిటీలకు సంబంధించి మూడు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ సిబ్బంది ఓట్ల లెక్కింపు రోజున ఉదయం 6గంటలకల్లా తమ కేటాయించిన కౌంటింగ్ కేంద్రాలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును ప్రారంభించి -మిగతా4లో..

# ఓట్ల లెక్కింపుకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి

- ఎన్నికల నిబంధనలకు లోబడే ఓట్ల లెక్కింపు
- 3 రౌండ్లలో పూర్తిస్థాయి ఫలితాలు ఒక్కో రౌండ్‌లో 8 వార్డుల లెక్కింపు
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్వహించనున్న రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు.నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడ నైస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్,కౌంటింగ్ సిబ్బందికినిర్వహిస్తున్న శిక్షణా తరగతులను పరిశీలించారు. ఎన్నికల నియమ నిబంధనలపై పూర్తి అవగాహనతో విధులు నిర్వహించాలని, వార్డువారీగా ఓట్ల లెక్కింపు క్రమబద్ధంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓట్ల లెక్కింపు రోజున ఉదయం 6 గంటలకల్లా సిబ్బంది తమ తమ కౌంటింగ్ కేంద్రాలకు హాజరు కావాలని ఆదేశించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభించి, అనంతరం పోలింగ్ కేంద్రాలు, వార్డుల వారీగా బ్యాలెట్ బాక్సులను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరవాలని తెలిపారు.ప్రతి 25 ఓట్లను ఒక కట్టగా తయారు చేసి, లెక్కించాలన్నారు. -మిగతా4లో..

# లేబర్ కోడ్స్ రద్దుకై పోరాడుతూనే ఉంటాం

- రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఏ.రాములు



ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**జడ్చర్ల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై నిరంతరంగా పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటాం అని రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఏ. రాములు స్పష్టం చేశారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమ్మె గురువారం జడ్చర్లలోని నేతాజీ చౌరస్తా నుండి బయలుదేరి అంబేద్కర్ చౌరస్తా అంబేద్కర్ కళాభవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమ్మె సందర్భంగా ఏ.రాములు మాట్లాడుతూ కార్మికులకు గుదిబండగా మారి నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ అమలుతో 40 కోట్ల మంది సంఘటిత అసంఘటిత కార్మికులు వారి కుటుంబాలు వీధిన పాలు అయితాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్లు లాభాలు పోగేసుకోవడానికి ఈ మార్గం కేంద్ర ప్రభుత్వం ఎంచుకుందని కేంద్ర రాష్ట్ర ఉమ్మడి జాబితాలోని కార్మిక చట్టాలను నియంతృత్వం దౌర్జన్య పూరితంగా -మిగతా4లో..

# మత్స్యకారుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

- రూ.50 కోట్లతో ఆక్వా కల్చరల్ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి
- రాష్ట్ర క్రీడలు పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

**ఉప్పునుంతల, ఫిబ్రవరి12 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తానని, అచ్చంపేట నియోజకవర్గంలో 100 ఎకరాల విస్తీర్ణంలో 50కోట్ల వ్యయంతో ఆక్వా కల్చరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గురు వారం చంద్రసాగర్ లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 సంవత్సరాల తర్వాత కుల,గణనరాహుల్ గాంధీ సూచన మేరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కులగణన నిర్వహించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కృష్ణ, గోదావరి మధ్యన ఉన్న మన ప్రాంతంలో ఉన్న మత్స్యకారులను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని, తెలంగాణ రాష్ట్రంలో మక్తల్ తర్వాత అచ్చంపేట నియోజకవర్గంలో నూతనంగా అధునాతనమైన పరికరాలతో చేపల ఉత్పత్తి ఏర్పాటు చేసి ఈ ప్రాంతం నుంచి ప్రభుత్వం ద్వారా చేపల పంపిణీ కార్యక్రమం చేసే విధంగా చేపడతామని ఆయన అన్నారు. ఇప్పటికీ 123 కోట్ల వ్యయంతో చేప పిల్లలు కొనుగోలు చేయడం జరిగిందని, మత్స్యకారుల శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తామని, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అసెంబ్లీలో 102 సార్లు చర్చించడం జరిగిందని పేర్కొన్నారు. ముదిరాజ్ సోదరులు తమ పిల్లలను చదివించే ప్రయత్నం ప్రతి ఒక్కరుచేయాలని, మత్స్యకారుల పిల్లలు చదువుకొని పోటీతత్వంలో పాల్గొనాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారం సాగేలా ప్రతిపాదనలు పంపించడం జరిగింది అన్నారు. ఇటీవల మక్తల్ లో జరిగిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం చేపట్టారు. తాటాకు చప్పుళ్ళకు భయపడే పరిస్థితి లేదని, మనోధైర్యంతో మత్స్యకారు సోదరులు ముందుకెళ్లాలన్నారు. అంతకుముందు టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మత్స్యకారులు అత్యధికంగా ఉన్న అభివృద్ధిలో వెనుకబడి ఉన్నారని అచ్చంపేట పట్టణంలో నిర్మిస్తున్న మత్స్యకారుల భవనానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇస్తూ ఇప్పటికే 25 లక్షలు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. చంద్రసాగర్ సమీపంలో ఉన్న చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం ప్రహరీ నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో ఉన్న చేప పిల్లలఉత్పత్తి కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంతో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం అభివృద్ధికి రెండుకోట్లు కేటాయించాలని మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెబ్బేటినిరంజన్, వాకిటి ఆంజనేయులు కోరారు. ఈ సందర్భంగా స్పందించిన మంత్రి మత్స్యకారుల అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పశుసంవర్ధక శాఖమంత్రి వాకిటి శ్రీహరితో పాటు టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, అదనపు కలెక్టర్ అమరేందర్, నాగర్ కర్నూల్ జిల్లా గ్రంథాలయ సంస్థచైర్మన్ గంగాపూర్‌రాజేందర్, అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు,అచ్చంపేట వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, రెవెన్యూ డివిజన్ అధికారి యాదగిరి, అచ్చంపేట డివిజన్ పోలీస్ అధికారి పల్లె శ్రీనివాసులు,అచ్చంపేట సీఐనాగరాజు, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటయ్య, అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అడుపాల గోపాల్‌రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంత రెడ్డి, నరసయ్య యాదవ్, కాశన్న యాదవ్, శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ వెంకటయ్య, సత్యనారాయణ,ముదిరాజ్ సోదరులు మల్లేష్, మాజీ ఎంపీపీ, రామనాథం,పర్వతాలు, సిద్దాపూర్ వెంకటయ్య, వివిధ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు పార్టీ నేతలు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- 480 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు
- పాలమూరు యూనివర్సిటీ వద్ద 163 బి.ఎన్.ఎస్. ఎస్ (144 సెక్షన్) అమలు
- విజయోత్సవ ర్యాలీలు పూర్తిగా నిషేధం
- మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకీ



పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ కార్పొరేషన్, భూత్పూర్, దేవరకద్ర మున్సిపాలిటీలకు సంబంధించిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ శుక్రవారం పాలమూరు యూనివర్సిటీ, బండమీదిపల్లి వద్ద నిర్వహించబడనున్న సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు సందర్భంగాఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 480 మంది పోలీసు సిబ్బందితో మూడంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. లెక్కింపు కేంద్రం పరిసర ప్రాంతాల్లో 163 బిఎన్ఎస్ఎస్ ప్రకారం నిషేధాజ్ఞలు (సెక్షన్ 144 అమలు)శుక్రవారం ఉదయం 6.00గంటల నుండి శనివారం ఉదయం 6.00 గంటల వరకు అమల్లో ఉంటాయని తెలిపారు.లెక్కింపు కేంద్రానికి హాజరయ్యే అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు జిల్లా ఎన్నికల అధికారి జారీ చేసిన గుర్తింపు కార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. అగ్గిపెట్టెలు, లైటర్లు, ఇంక్ బాటిల్స్, పేలుడు పదార్థాలు లేదా భద్రతకు ముప్పు కలిగించే ఏవైనా వస్తువులు లెక్కింపు కేంద్రంలోకి తీసుకురావడం పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. తనిఖీలు నిర్వహించే భద్రతా సిబ్బందికి పూర్తిసహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫలితాల అనంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, బైక్ ర్యాలీలు, డీజేలు, టపాకాయలు కాల్చడం వంటి కార్యక్రమాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళిని గెలిచిన, ఓడిన అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేసిరిమాండ్‌కు పంపిస్తామని హెచ్చరించారు. లెక్కింపు కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు, క్యూఆర్‌టీల, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీములు, స్ట్రైకింగ్ ఫోర్సులు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.మహబూబ్‌నగర్‌టౌన్, భూత్పూర్ దేవరకద్ర ప్రాంతాల్లో ఫలితాల అనంతరం గెలుపు ఓటమి నేపథ్యాలలో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా ముఖ్యమైన ప్రాంతాల్లోచెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన పహారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా గురువారం పాలమూరు యూనివర్సిటీ వద్ద ఓట్ల లెక్కింపునకు నియమించబడిన పోలీసు అధికారులు సిబ్బందికి జిల్లా ఎస్పీ డి.జానకి బందోబస్తు సూచనలు ఇచ్చి అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.ప్రజలందరూ శాంతి, సామరస్య వాతావరణాన్ని కాపాడుతూ ఎన్నికల ఫలితాలను పరస్పర గౌరవంతో స్వీకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.ఈ క్రమంలో అదనపు ఎస్పీ రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎలక్షన్ సెల్ డిఎస్పీ గిరిబాబు, డీసీఆర్ బి డీఎస్పీ రమణారెడ్డి, రూరల్ సీఐ గాంధీ నాయక్ ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# సీసీ కెమెరాల నిఘాలో కౌంటింగ్

- ఎలాంటి తప్పిదాలకు చోటు లేకుండా ఓట్ల లెక్కింపు
- గద్వాల జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న గద్వాల జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్

**గద్వాల ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** బ్యాలెట్ పేపర్స్ కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు చోటు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గద్వాల మున్సిపాలిటీకి సంబంధించిన కౌంటింగ్ కేంద్రంగా గోనుపాడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఎంపిక చేయడంతో అక్కడ గురువారం కౌంటింగ్ సూపర్వైజర్స్, అసిస్టెంట్లకు లెక్కింపు ప్రక్రియపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 13న లెక్కింపు సందర్భంగా సిబ్బంది ఉదయం 6గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకొని రిపోర్టు చేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూము తెరిచాక బ్యాలెట్ బాక్స్ లను కౌంటింగ్ హాల్స్ లోకి తీసుకెళ్లి ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో కౌంటింగ్ చేసిన అనుభవం ఉన్న సిబ్బందినే ప్రస్తుతం తీసుకున్నందున ఎలాంటి ఇబ్బందులు లేకుండా లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్స్ లెక్కించి అనంతరం సాధారణ బ్యాలెట్ పేపర్స్ లెక్కింపు చేపట్టాలన్నారు. వార్డుల వారీగా ఆయా పోలింగ్ స్టేషన్ల బ్యాలెట్ బాక్స్ లను నిర్దేశించిన టేబుల్ వద్ద ఓపెన్ చేసిఆయా అభ్యర్థులకు వచ్చిన ఓట్లను25 బ్యాలెట్ పేపర్ల చొప్పున కట్టలు కట్టి ఉంచాలన్నారు. తిరస్కరించబడిన బ్యాలెట్ పేపర్ల విషయంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి సంబంధిత రిటర్నింగ్ అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా అభ్యర్థులు రీకౌంటింగ్ కోరితే నిబంధనలను అనుసరించి రిటర్నింగ్ -మిగతా4లో..

# క్రీడలతో ప్రపంచ స్థాయి గుర్తింపు

- చదువులతో పాటు క్రీడలపై దృష్టి సారించాలి
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- గోపాల్‌పేటలో జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

**వనపర్తి ప్రతినిధి ఫిబ్రవరి12 ప్రభాతవార్త:** క్రీడలతో ప్రపంచ స్థాయి గుర్తింపును పొందవచ్చునని, మానసికోల్లాసంతో పాటు, దేహదారుఢ్యం సమ కూరుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. గోపాల్పేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయిదిలీ క్రికెట్ క్రీడా పోటీలను గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రారంభిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కార్ రాష్ట్రవ్యాప్తంగా క్రీడలకు ఎంతో ప్రాధాన్యత నిస్తోందని, క్రీడాకారులు ఈ సదావకాశాన్ని వినియోగించుకుని గొప్పక్రీడాకారులుగా పేరు తెచ్చుకోవాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. 80 కిలోమీటర్ల వేగంతో పరిగెత్తే జింకను, 60 కిలోమీటర్ల వేగంతో పరిగెత్తే పులి వేటాడి చంపుకుని తింటుందని,జింకభయంతో వెనకకు చూస్తూ పరిగె త్తుతుండడంతో పులి సులభంగా జింకను పట్టుకుంటుందని ఈ సందర్భంగా ఆయన గుర్త చేశారు.విద్యార్థులు కూడావారి లక్ష్యాన్ని నిర్ధారించుకొని ప్రత్యర్థులు ఎంత సమర్థులైన మీరుకూడా పులిలాలక్ష్యాన్ని చేరుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

**ఎమ్మెల్యే మార్నింగ్ వాక్‌లో పలు సమస్యలు గుర్తింపు:** వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు..వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి గురువారం వనపర్తి పట్టణంలోని నందిహిల్స్ 30వ వార్డులో మార్నింగ్ వాక్ చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీవాసులతో కలిసి నడక సాగించారు.నంది హిల్స్ పార్కులో నిర్మిస్తున్న సామూహిక భవన నిర్మాణ పనులను పరిశీలించారు. టిఎంఆర్ స్విమ్మింగ్ పూల్ ప్రాంతంలోని రోడ్ల వెంట నడక సాగించినఎమ్మెల్యే ఆ ప్రాంతంలో సీసీరోడ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. కరెంటు స్తంభాలు, వీధిలైట్ల ఏర్పాటు, మురికి కాలువలను నిర్మాణం లాంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి కాలనీని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఆయనఅన్నారు.వనపర్తిలో రాజకీయాలకి అతీతంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, పట్టణాభివృద్ధిలో రాజకీయాలు ఒకచిన్న భాగమే తప్పఅభివృద్ధికి ఆటంకాలు కాకూడదన్న సంకల్పంతో ముందుకెళుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.కార్యక్రమంలో కాలనీ వాసులు స్థానిక పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు. -మిగతా4లో..

## కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టండి

**సిపిఎం మండల కార్యదర్శి బాల్ రెడ్డి**

**వీపనగండ్ల ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టండి అని సిపిఎం పార్టీ వీపనగండ్ల మండల కార్యదర్శి బాల్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు దేశవార్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం నాడు వీపనగండ్ల మండల కేంద్రంలో వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించి గ్రామంలో జులుస్ తీశారు ఇందులో భాగంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బాల్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అలంబిస్తున్న కార్మిక రైతు కూలీ వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పి కొట్టాలని అదేవిధంగా నాలుగు లేబర్ కోడులు తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాచిందని ఆయన తెలిపారు ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం జరిగిందని విద్యుత్తు చట్ట సవరణ చేయాలని రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆయన తెలిపారు అదేవిధంగా కార్మికుల కనీస వేతనాలు 26వేల రూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బాలగౌడ్ గోపాల్దిన్నె గ్రామ సర్పంచ్ వనపర్తి జిల్లా మహిళా సంఘం జిల్లా కోశాధికారి అయినా దొడ్ల కవిత ఉపాధ్యక్షురాలు రేణుక సిఐటియు నాయకులు ఆశన్న బాలకృష్ణ చారి రంగస్వామి రాముడు అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు సుగుణబాయి ఆశా వర్కర్ యూనియన్ నాయకురాలు సుజాత పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు బాల్ రెడ్డి

## మహాశివరాత్రికి శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

**నారాయణపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** నారాయణపేట మహాశివరాత్రి సందర్భంగా నారాయణపేట పట్టణం నుంచి శ్రీశైలానికి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు డిపో మేనేజర్ టి.లావణ్య తెలిపారు. ఫిబ్రవరి 13 నుంచి 16 వరకు ఈ ప్రత్యేక బస్సు సేవలు అందుబాటులో ఉంటాయని ఆమె వెల్లడించారు. ఫిబ్రవరి 13, 14 తేదీల్లో నారాయణపేట నుంచి ఉదయం 5, 6, 7, 8 గంటలకు బస్సులు బయలుదేరుతాయి. అదే రోజున శ్రీశైలం నుంచి మధ్యాహ్నం 12.15, 1.15, 2.40, 3.40 గంటలకు బయలుదేరి సాయంత్రం 6.45, 7.45, రాత్రి 9.10, 10.10 గంటలకు నారాయణపేటకు చేరుకుంటాయి మహాశివరాత్రి అయిన ఫిబ్రవరి 15న ప్రత్యేకంగా 16 బస్సులు నడపనుండగా, ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అవసరాన్ని బట్టి సేవలు అందిస్తారు. ఒక మార్గంలో 30 మంది భక్తులు ఉన్నచో అక్కడికే ప్రత్యేక బస్సును ఏర్పాటు చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 7382828085 నంబర్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

## మున్సిపల్ కౌంటింగ్ సిబ్బంది కేటాయింపు పూర్తి

**గద్వాల, ఫిబ్రవరి 12, ప్రభాత వార్త:** మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కోసం రెండవ ర్యాండమైజేషన్ ద్వారా కౌంటింగ్ సిబ్బంది కేటాయింపును పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తెలిపారు.గురువారం ఐడీఓసీ కలెక్టర్ ఛాంబర్‌లో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి రెండవ ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గద్వాల్, అలంపూర్,అయిజ,వడ్డేపల్లి మున్సిపాలిటీలలో మొత్తం 76 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించేందుకు 76 మంది సూపర్వైజర్లు,152 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు కలిపి మొత్తం 228 మంది సిబ్బందిని రెండవ ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.ప్రతి టీమ్‌లో ఒక సూపర్వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు ఉండే విధంగా మొత్తం 76 టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కౌంటింగ్ అధికారుల కేటాయింపులో పూర్తి పారదర్శకతను పాటిస్తూ ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించినట్లు వెల్లడించారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను నిష్పక్షపాతంగా,పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,ఎన్నికల సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.


ఆన్ లైన్ లో ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్న కలెక్టర్ సంతోష్

## హైమాస్ లైట్ల ఏర్పాటుకు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే

**శ్రీరంగాపూర్,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని మాసం శాఖద్రి దర్గా ఉన్న స్మశాన వాటిక చోటు కాంపౌండ్, మజీద్ కమ్యూనిటీ హాల్ గురించి అక్కడ జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి, దర్గా దగ్గర ఐమాక్స్ లైట్ల ఏర్పాటు గురించి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని కలిసి తెలియజేయడం జరిగింది. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ శ్రీరంగాపూర్ మండల కేంద్రాన్ని అభివృద్ధి చేయడంలో తాను ముందు ఉంటానని అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేస్తూ దర్గా దగ్గర హైమాక్స్ లైట్లు ఏర్పాటుకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెడ్డిచర్ల శ్రీహరి రాజుతో పాటు మజీద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ వహిద్దిన్, క్యాషియర్ హసీఫ్, వార్డ్ మెంబర్ నవీద్,అబ్దుల్ సమీర్,ఎండి ఖదీర్, బషీర్, షఫీ, ఖాదర్,అఫ్రోస్,సల్లవుద్దిన్ , మస్తాన్,ఖయ్యాం, అవేజ్ , బహుజన రమేష, సంపత్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను కలిసిన దర్గా కమిటి సభ్యులు

## ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఆత్మకూర్ ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి గురువారం సాయంత్రం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద మూడింతల భద్రత వ్యవస్థ ఏర్పాటు చేశామ ని ఓట్ల లెక్కింపు కేంద్రాలకు అభ్యర్థితో పాటుగా ఒకరికి మాత్రమే అనుమతి ఉంటుందని ఈ విషయాన్ని గమనించి ఆయా రాజకీయ పార్టీల నాయకులు అధికారులతో సహకారమందించాలని విజ్ఞప్తి చేశారు. ఉదయం ఎనిమిది గంటలకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు కానున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం వరకు ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను చిన్నంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు కలెక్టర్ ఇవ్వడంతో పాటుగా పోలింగ్ సర్వేలు ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేసేందుకు చర్యలు తీసుకో వాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంబడి అనపర్తి ఆర్డిఓ సుబ్రహ్మణ్యం , డిఎస్పీ వెంకటేశ్వరరావు, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ శశిధర్ తదితరులతో పాటుగా పలువురు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఓట్ల లెక్కింపు కేంద్రాలను సందర్శించి పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

## గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు అవుదాం

**సర్పంచ్ ఏశమోని లక్ష్మీ ఆంజనేయులు**

**చిన్న చింతకుంట, ఫిబ్రవరి 12 ప్రభాత వార్త :** గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పల్లమర్రి గ్రామ సర్పంచ్ ఏశమోని లక్ష్మీ ఆంజనేయులు కోరారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభను నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ 2023,24 సంవత్సరానిగాను 15వ ఆర్థిక సంఘం నుంచి రెండు లక్షల 85 వేల రూపాయలు రావడం జరిగిందని ఆమె తెలిపారు. వీటిని గతంలో గ్రామ మౌలిక వసతులకై ఖర్చు చేసిన వాటికి జమ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. రాబోయే గ్రామపంచాయతీ నిధుల ద్వారా గ్రామానికి తక్షణమే అవసరమయ్యే పనులను గుర్తించి పూర్తి చేసుకుందామని ఆమె తెలిపారు. వికసిత్ భారత్ జి రాంజీ పథకం కింద మహిళా సమైక్య భవనానికి 10 లక్షల రూపాయలు మంజూరయన్నారు. ఈ భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్నామని ఆమె తెలిపారు. ఈ గ్రామ సభలో గ్రామ ఉపసర్పంచ్ విజయ భాస్కర్ రెడ్డి, వార్డు సభ్యులు అనిల్ చారి, నాయకులు నరేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.


పిల్లమర్రిలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

# మున్సిపల్ అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడు

- గెలుపుపై ఎవరి ధీమా వారిదే..
- మ్యాజిక్ ఫిగర్‌కు చేరుకుంటామంటున్న కాంగ్రెస్
- ఆరు స్థానాల్లో విజయకేతనమెగిరేసి మున్సిపాలిటీలో పూర్వవైభవాన్ని చాటుతామంటున్న బీఆర్ఎస్
- మూన్నాల్గు స్థానాల్లో విజయం సాధిస్తామంటున్న బీజేపీ
- నేటి మధ్యాహ్నం కల్లా ఫలితాల వెల్లడి

**భూత్పూర్,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :** నలభై గంటల ఉత్కంఠకు తెరపడనుంది. బుధవారం(11వ తేదీ) జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు శుక్రవారం(13వ తేదీ) వెలువడనున్నాయి.శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి పొద్దుపోయే దాకా కౌంటింగ్‌ను జిల్లా కేంద్రంలోని పీయూలో నిర్వహిస్తునారు. దేవరకద్ర నియోజికవర్గంలోని భూత్పూర్,కొత్తకోట,దేవరకద్ర మున్సిపాలిటీలకు సంబంధించి 37కౌన్సిలర్ల పదవులకు ఎన్నికలు జరిగాయి.గెలుపుపై ఆయా పార్టీలు,అభ్యర్థులు ఎవరికివారే ధీమాను వ్యక్తం చేస్తున్నారు.భూత్పూర్ మున్సిపాలిటీలోని పది వార్డు కౌన్సిలర్ స్థానాలన్నీ గెలిచి మున్సిపాలిటీని క్లీన్‌స్వీప్ చేస్తామని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ ధీమాను వ్యక్తం చేస్తున్నారు.పదికి పదికాకున్నా అధికారం చేపట్టేందుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ ఆరింటిలో విజయం సాధించి మున్సిపాలిటీని హస్తగతం చేసుకుని భూత్పూర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండానెగురవేసి అధికారాన్ని హస్తగతం చేసుకుంటామన్న అభిప్రాయం,ధీమాను నవీన్‌గౌడ్ వ్యక్తం చేస్తున్నారు.తమ అభ్యర్థి ముడావత్ బాలకోటి మున్సిపల్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపడతారని నవీన్‌గౌడ్ స్పష్టం చేస్తున్నారు.ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ మాత్రం తాము భూత్పూర్ మున్సిపాలిటీలో ఏడెనిమిది స్థానాలు గెలిచి భూత్పూర్ మున్సిపాలిటీపై గులాబి జెండానెగురవేసి,మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు పూర్వవైభవాన్ని తెస్తామన్న ధీమాను పార్టీ మండల అధ్యక్షుడు,మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ ధీమాను వ్యక్తం చేస్తున్నారు.పదింటిలో మూన్నాల్గు స్థానాలు గెలిచి వైస్ చైర్మన్‌ను కొట్టేస్తామని బీజేపీ నాయకుడు కెంద్యాల శ్రీనివాసులు(ఐదిండ్ల శ్రీను)స్పష్టం చేస్తున్నారు. గడిచిన వారం,పదిరోజులుగా నిద్రాహారాలుమాని,రేయింబవళ్లు శ్రమించి ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకుని ఎన్నికల్లో తమ భవితవ్యాన్ని పరీక్షించుకునేందుకు ఆహర్నిశలు శ్రమించిన అభ్యర్థుల భవితవ్యం బాక్సుల్లో భద్రంగా ఉంది.ఎన్నో రోడ్‌షోలు,బల ప్రదర్శనలు,ప్రచారాలు,ఇంటింటి ప్రచారాలు నిర్వహించిన ఆయా పార్టీల అభ్యర్థులు బుధవారం పోలింగ్‌తో కొంత ఊపిరి పీల్చుకున్నారు.వారం రోజులుగా ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు నానా తంటాలు పడ్డారు.భూత్పూర్ మున్సిపాలిటీలోని పదివార్డులలో దాదాపు 40మంది అభ్యర్థులు ఎన్నికబరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు పోటీలో ఉండి కష్టపడ్డారు.వీరి భవితవ్యం 13వ తేదీ(శుక్రవారం)మధ్యాహ్నం కల్లా తేలనుంది.మున్సిపాలిటీలో జనరల్ మహిళకు కేటాయించిన ఒకటో వార్డు నుంచి ముడావత్ మాధురి(కాంగ్రెస్),ఆర్ దేవి(బీఆర్ఎస్),మంగ(బీజేపీ) సభావత్ సౌజన్య(ఇండి)లు పాటీ పడుతుండగా,బీసీ మహిళకు రిజర్వు అయిన రెండోవార్డు నుంచి నిమ్మల అన్నపూర్ణ(కాంగ్రెస్), అనుప సుజాత(బీఆర్ఎస్),సిగురం సంధ్యారాణి(బీజేపీ),దేగావత్ శాంతి(ఇండి)లు పోటీలో ఉన్నారు.ఎస్టీ జనరల్‌కు కేటాయించిన మూడోవార్డు నుంచి పాల్యావత్ లాల్యా(కాం గ్రెస్),కాట్రావత్ రాము (బీఆర్ఎస్),పాత్లావత్ సోమ్లనాయక్(బీజేపీ) లతో పాటు ఎరుకలి ముత్తయ్య స్వతంత్ర అభ్యర్థిగా,తిరుపతయ్య (టీఆర్‌పీ) అభ్యర్థిగా బరిలో ఉన్నారు.ఎస్సీ జనరల్‌కు కేటాయించి న నాల్గొవార్డు నుంచి గడ్డం సాయిప్రసాద్(కాంగ్రెస్), గడ్డంప్రేమ్‌కు మార్(బీఆర్ఎస్)లు ప్రధానంగా పోటీపడుతుండగా,బజారు నర్సిం హులు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారు.ఇక బీసీ జనరల్‌కు కేటాయించిన ఐదోవార్డు నుంచి కెంద్యాల పద్మ(కాంగ్రెస్),మూష బాలస్వామి (బీఆర్ఎస్),ఊరడి మహానంది(బీజేపీ)లు ప్రధానంగా పోటీ పడుతున్నారు.జనరల్‌కు కేటాయించిన ఆరోవార్డు నుంచి రెంద్యాల మశ్చందర్(కాంగ్రెస్),ఎల్ రామకృష్ణ(బీఆర్ఎస్),కెంద్యాల శ్రీనివాసులు (బీజేపీ)లు పోటీ పడుతుండగా గడ్డం రాజు(బీఎస్పీ)రం గంలో ఉన్నారు.జనరల్ మహిళకు రిజర్వు అయిన ఏడోవార్డు నుంచి ఎ శ్రీదేవి(కాంగ్రెస్),తీలేటి స్వాతి(బీఆర్ఎస్),సూరన్నగారి లత(బీజేపీ)లు రంగంలో ఉన్నారు.జనరల్‌కు కేటాయించిన ఎనిమి దోవార్డు నుంచి ముడావత్ బాలకోటి(కాంగ్రెస్ చైర్మన్ అభ్యర్థి), మొహమద్ అజీజ్(బీఆర్ఎస్),ఎండి ఫారూక్(బీజేపీ),మల్లికార్జున్ (ఇండి)లు పోటీ పడుతున్నారు.ఎస్టీ మహిళకు కేటాయించిన తొమ్మి దోవార్డు నుంచి వి చంద్రకళ(కాంగ్రెస్),సంధ్యా లావుడ్య(బీఆర్ఎస్), పాల్యావత్ మోతి బీక్యానాయక్(బీజేపీ)లు ప్రధానంగా పోటీ పడుతుండగా ఇద్దరు (పాత్లావత్ మణెమ్మ,సభావత్ శిరీష) స్వతంత్ర అభ్యర్థులు రంగంలో ఉన్నారు.బీసీ మహిళకు కేటాయించిన పదోవార్డు నుంచి లిక్కి సూర్యకళ(కాంగ్రెస్),కడప పద్మజ(బీఆర్ఎస్),దిడ్డి లక్ష్మి(బీజేపీ)లతో ఎటు నాహిత్ బేగం(ఇండి)పోటీ పడు తున్నారు.గెలుపెవరి ది,అధికారాన్ని ఎవరు చేజిక్కించుకుంటారన్నదీ నేడు తేలిపోతుంది.

## కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు : జిల్లా ఎస్పీ


ఎస్పీ శ్రీనివాస రావు

**గద్వాల ఫిబ్రవరి 12, ప్రభాత వార్త:** జోగుళాంబ గద్వాల్ జిల్లాలో మున్సిపాలిటీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో జిల్లా ఇన్‌స్పెక్టర్లు, సివిల్ డీఎస్పీ, ఏఆర్ డీఎస్పీ, ఆర్ఐలు తదితర అధికారులతో భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు జారీ చేశారు. జిల్లాలో గోనుపాడు, అయిజ, శాంతినగర్, అలంపూర్ ప్రాంతాల్లో నాలుగు కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.తేది13.02.2026 శుక్రవారం నిర్వహించనున్న మున్సిపాలిటీ ఎన్నికల ఓట్ల లెక్కింపును దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మొత్తం 250 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లు మరియు కౌంటింగ్ కేంద్రాల వద్ద ఆర్మ్డ్ పోలీస్, సివిల్ పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయడంతో పాటు ప్రవేశ–నిష్క్రమణ మార్గాల వద్ద సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనుమతి లేని వ్యక్తులు కేంద్రాల వద్దకు చేరకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లు పోలీసులు సూచించిన ప్రదేశాల్లోనే వాహనాలు పార్క్ చేయాలని, కౌంటింగ్ సెంటర్‌లోకి మొబైల్ ఫోన్లు తీసుకెళ్లడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. లెక్కింపు కేంద్రానికి హాజరయ్యే అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు జిల్లా ఎన్నికల అధికారి జారీ చేసిన గుర్తింపు కార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. అగ్గిపెట్టెలు, లైటర్లు, ఇంక్ బాటిల్స్, పేలుడు పదార్థాలు లేదా భద్రతకు ముప్పు కలిగించే ఏవైనా వస్తువులు లెక్కింపు కేంద్రంలోకి తీసుకురావడం పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. తనిఖీలు నిర్వహించే భద్రతా సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 163 బి ఎన్ ఎస్ ఎస్ (పూర్వం 144 సిఆర్ పి సి) సెక్షన్ అమల్లో ఉన్నందున ఎవరూ గుంపులుగా గుమికూడరాదని తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు శుక్రవారం ఉదయం 6.00 గంటల నుండి శనివారం ఉదయం 6.00 గంటల వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. ఎన్నికల మోడల్ కోడ్ అమల్లో ఉన్నందున విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని, సభలు, సమావేశాలు నిర్వహించడం కూడా నిషేధమని పేర్కొన్నారు. మోడల్ కోడ్ ముగిసిన అనంతరం సంబంధిత పోలీస్ అధికారుల అనుమతి తీసుకుని మాత్రమే విజయోత్సవ ర్యాలీలు నిర్వహించుకోవాలని సూచించారు.కౌంటింగ్ టేబుళ్లు, అభ్యర్థుల ఏజెంట్లకు కేటాయించిన స్థానాలు, మీడియా పాయింట్లు, మౌలిక సదుపాయాలపై అధికారులతో చర్చించిన ఎస్పీ, ఎన్నికల నియమావళి ప్రకారం లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా సాగేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అలాగే నాలుగు కౌంటింగ్ కేంద్రాల వద్ద సిబ్బంది ప్రత్యేక బ్రీఫింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలందరూ శాంతి, సామరస్య వాతావరణాన్ని కాపాడుతూ ఎన్నికల ఫలితాలను పరస్పర గౌరవంతో స్వీకరిస్తూ పోలీసులకు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ కె. శంకర్, గద్వాల్ డీఎస్పీ వై. మొగిలయ్య, ఏఆర్ డీఎస్పీ టి. నరేందర్ రావు, డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్ , ఎలక్షన్స్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు ఉద్యమాలు ఉధృతం

**ఆత్మకూర్ ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** దేశంలోని నరేంద్ర మోడీ సారథ్యంలో కొన్ని ఒక సాగుతున్న బిజెపి ప్రభుత్వం కార్మికుల పాలిట బుద్ధిబండగా మారినటువంటి నాలుగు లేబర్ కోర్లను రద్దు చేసే వరకు ఉద్యమాలు ఉధృతంగా కొనసాగిస్తామని వాపక్ష పార్టీలకు చెందిన కార్మిక సంఘాల నేతలు హెచ్చరించారు. దేశావబితా పార్వతీక సమ్మెలో భాగంగా గురువారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని బస్టాండు నుండి గాంధీ చౌరస్తా వరకు కార్మిక సంఘాల నేతృత్వంలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం గాంధీ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా కార్మికులను వంచనకు గురి చేస్తుందని అందులో భాగంగానే నాలుగు లేబర్ కోర్లను తెచ్చి కార్మికుల శ్రమను దోచుకునేందుకు కుయుక్తులు పన్నుతుందని వారు తీవ్రస్థాయి లో ఆరోపించారు.అంతేకాకుండా వామపక్షాల ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించి సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో కనీసం 200 రోజులు పరిధిలో కల్పించి కనీస వేతనాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. మతతత్వ విధానాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటున్న బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా కార్మికుల పట్ల సానుకూలంగా వ్యవహరించి లేబర్ కోర్లను రద్దు చేయాలని లేని పక్షంలో భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల టియుసిఐ, సిఐటియు, ఏఐటియుసి, ఐఎన్టియుసి కార్మిక సంఘాలకు చెందిన నాయకులు రాజు, ప్రసాద్, రాబర్ట్, శ్రీనివాస్ తదితరులతో పాటుగా పలువురు కార్మికులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో రాస్తారోకో నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు కార్యకర్తలు

## లేబర్ కోడులను రద్దు చేయాలని ఎల్ఐసి ఉద్యోగుల సమ్మె

**గద్వాల ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోర్టులను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం 2025, వి బి జి రాంజీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసి లో 100 విదేశీ పెట్టుబడులను అనుమతించడం లాంటి ప్రమాదకర నిర్ణయాలను ఉపసంహరించాలని కార్మిక, ప్రజా రైతు వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు ఎల్ఐసి ఆవరణలో ఎల్ఐసి ఉద్యోగులు 100 సమ్మెలో పాల్గొన్నారు. గురువారం గద్వాల ఎల్ ఐ సి బ్రాంచిలో ఉద్యోగులు సమ్మె నిర్వహించారు. ఈ సమ్మెలో బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాలు కార్మిక చట్టాలు లేని దేశంగా మార్చాలని, కార్మికుల్ని నిరాయుదులను చేసి పెట్టిపడుదారులకు, పారిశ్రామికవేత్తలకు మతోన్మాద కార్పొరేట్లకు బంగారు పళ్లెంలో పెట్టి బహుమానం ఇచ్చేందుకు ఈ ప్రభుత్వం సిద్ధమైందనీ అన్నారు. కేంద్ర రాష్ట్ర ఉమ్మడి జాబితాలోని కార్మిక చట్టాలను నియంతృత్వ దౌర్జన్య పూరితంగా కేంద్ర ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకొని మార్చివేసిందనీ, ఇది రాజ్యాంగంలోని ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీసే రాజ్యాంగ వ్యతిరేక చర్య అని అన్నారు. కనీస వేతనాలకు బదులుగా ఫ్లోర్ లెవెల్ కనీస వేతనం అమలు చేయనున్నట్లు లేబర్ కోడులలో పేర్కొన్నారు.ఎన్ని పని గంటలు ఉండాలో ఎప్పుడు విరామం ఉండాలో ఎంత స్పీడ్ ఓవర్ టైం ఉండాలి ప్రభుత్వమే నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. లేబర్ కోడుల వల్ల అసంఘటితరంగా కార్మికులకు అనేక ప్రయోగాలు లభిస్తాయని మోడీ ప్రభుత్వం అబద్ధపు ప్రచారం చేస్తోందని రంగారావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ప్రెసిడెంట్ నర్సింగ్, మల్లికార్జున్, రంగయ్య, ఉదయ్ కుమార్, శివశంకర్, శైలేష్, సుదర్శన్ శెట్టి, లక్ష్మీ మ్రకాంత్ , మనీష్ ప్రవీణ్ సూరజ్ పద్మ హైదరాబాద్ డివిజన్ ఎల్ ఐ వై ఏ ఎఫ్ ఐ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్, బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, రిటైర్డ్ ఎల్ఐసి ఎంప్లాయ్ కృష్ణయ్య , వెంకట్ రాములు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న ఎల్ ఐ సి ఉద్యోగులు

## లేబర్ కోడ్‌లు కార్మిక వర్గంపై వ్రేలాడుతున్న ఉరి త్రాళ్లు

**నారాయణపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ పార్క్ వద్ద సభ నిర్వహించి, అనంతరం వీర సావర్కర్ చౌరస్తా మీదుగా సత్యనారాయణ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామి రెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి బండమీది బాల్‌రామ్ తదితరులు ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్‌లు కార్మిక వర్గానికి ఉరివేసినట్టేనని వారు విమర్శించారు. ఎనిమిది గంటల పనిదినాన్ని పెంచడం, కనీస వేతనాల హక్కులను బలహీనపరచడం అన్యాయమన్నారు. సంఘం ఏర్పాటు, సమ్మె హక్కులను హరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాట్యుటీ, పెన్షన్‌లపై దాడులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం దేశ ఆర్థిక వ్యవస్థకు హానికరమన్నారు. బ్యాంకులు, ఇన్సూరెన్స్ రంగాల్లో విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడం తప్పని చెప్పారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారని తెలిపారు. జిల్లాలో పలు పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు మూతపడ్డాయని పేర్కొన్నారు. లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక, రైతు సంఘాల నాయకులు మరియు సుమారు 1200 మంది కార్మికులు పాల్గొన్నారు.సిఐటియు జిల్లా అధ్యక్షులు గోవిందరాజ్ అధ్యక్షతన సభ జరిగింది. టీయూసీఐ జిల్లా నాయకులు బి. నరసింహ, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షులు శశికళ, ఆశా యూనియన్ నాయకులు బాలమణి తదితరులు పాల్గొన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్, సిఐటియు ఉపాధ్యక్షులు జోషి, విఓఏ సంఘం అధ్యక్షులు భీమేష్ మద్దతు తెలిపారు. ఉపాధి హామీ క్షేత్ర సహాయకుల సంఘం నాయకులు ప్రసాద్, గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు లక్ష్మణ్, నర్సింహ హాజరయ్యారు. అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్, భవన నిర్మాణ, మిషన్ భగీరథ, మధ్యాహ్న భోజన కార్మికులు, వీవోఏలు, మెప్మా ఆర్పీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల గోడపత్రిక ఆవిష్కరించిన అదనపు కలెక్టర్

**వెల్దండ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** దక్షిణ కాశీగా విరజిల్లుతున్న గుండాల అంబ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శివరాత్రి నుండి అంగరంగ వైభవంగా కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల గోడపత్రికను గురువారం జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా పరిపాలన అధికారి చంద్రశేఖర్, ఆలయ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యనిర్వహణాధికారి ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, ఆలయ అర్చకులు ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో దేవాలయ అర్చకులు కృష్ణయ్య శర్మ, సంతోష్ శర్మ, నరహరి శర్మ,దేవాలయ కమిటీ వైస్ చైర్మన్ అరుణ్‌నాయక్, సభ్యులు అంజయ్య, తిరుపతయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

## విద్యుత్ ఉద్యోగ, కార్మికుల నిరసన

**గద్వాల ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఎలక్ట్రిసిటీ అమెండ్మెంట్ బిల్ 2025 కు వ్యతిరేకంగా భోజనం విరామ సమయమున విద్యుత్ కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎలక్ట్రిసిటీ అమెండ్మెంట్ బిల్ 2025 కు వ్యతిరేకంగా గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయం లో గద్వాల సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది.ఈ నిరసన కార్యక్రమం లో అధిక సంఖ్య లో విద్యుత్ ఉద్యోగులు,కార్మికులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో డి ఈ నాగరాజు, ఈ డి ఈ పులికొండ కురుమూర్తి, రహీం మాసం,గద్వాల్ సర్కిల్ సభ్యులు రామకృష్ణ, శ్రీధర్, అశోక్,నగేష్, ప్రవీణ్,పరమేష్,శ్రీనివాసులు, భాస్కర్,తేజానాయక్,నాగరాజు,శ్రీయుక్త,కోమలి,అంజనమ్మ,జీవిత,మదన్,రంగయ్య,రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ ఏఈకి వినతి

**ఎర్రవల్లి ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** ఎర్రవల్లి మండల కేంద్రంలో విద్యుత్ సమస్యలపై విద్యుత్ శాఖ అధికారికి వినతి పత్రం అందజేసిన ఎర్రవల్లిగ్రామస్తులు గ్రామపంచాయతీ పరిధిలో నెలకొన్న విద్యుత్ అంతరాయం లో వోల్టేజీ సమస్యలు నూతనంగా ఏర్పడిన కాలనీలలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు గురించి గ్రామస్తులు విద్యుత్‌శాఖ అధికారి ఏఈ శేఖర్‌కు వినతి పత్రం అందజేయడం జరిగింది.సానుకూలంగా స్పందించిన విద్యుత్‌శాఖ అధికారి త్వరలో మీ సమస్యలను తీర్చు తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మద్దిలేటి గౌడ్, గ్రామస్తులు కృష్ణ సాగర్,లక్ష్మన్న, రాముడు, వెంకటన్న,నాగన్న, దశరథం, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడకారుడ్ని సన్మానించిన ఎమ్మెల్యే

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** మండలంలోని పొలిటికల్ గ్రామానికి చెందిన ఆర్కపల్లి సైదులు తనయుడు ఆర్కపల్లి అరవిందు రెస్లింగ్ లో రాష్ట్రస్థాయిలో మొదటి గోల్డ్ మెడల్ రావడంతో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ తో పాటు మండల పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపిరెడ్డి రమేష్ రెడ్డి, నక్కపల్లి జగదాం దాస్, జంగయ్య తదితరులు ఉన్నారు.

## పేదలకు చీరల పంపిణీ...

**వివాహ వార్షికోత్సవ సందర్భంగా ఏటా సేవా కార్యక్రమాలు**

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** వివాహ వార్షికోత్సవ సందర్భంగా మక్తల్ వాసవీ క్లబ్ అధ్యక్షుడు హరిక్రిష్ణ త్రివేణి దంపతులు దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా హరిక్రిష్ణ త్రివేణి దంపతులు మాట్లాడుతూ.. ప్రతి ఏటా వివాహ వార్షికోత్సవ సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. వార్షికోత్సవ సందర్భంగా పట్టణంలోని నిరుపేదలకు చీరల పంపిణీ చేశారు. సాయంత్రం కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ సభ్యులతో పాటు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు శాలువా కప్పి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షులు మేడిశెట్టి హరికృష్ణ, కోశాధికారి తాళంపల్లి పవన్, వనిత క్లబ్ అధ్యక్షులు కలవాల ప్రసన్న, కోశాధికారి తాళంపల్లి కావ్య, వడ్వాట్ నరేష్, జయలక్ష్మి, త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

**నారాయణపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** పేట మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులకు ఈనెల 11న పోలింగ్ నిర్వహించబడింది. ఓట్ల లెక్కింపు ఫిబ్రవరి 13 శుక్రవారం ఉదయం 8 గంటల నుండి ప్రారంభం కానుంది. కౌంటింగ్ కోసం రెండు హాళ్లను ఏర్పాటుచేసి,ప్రతి హాల్‌లో నాలుగు టేబుళ్ల చొప్పున మొత్తం ఎనిమిది టేబుళ్లు సిద్ధం చేశారు. మూడు రౌండ్లలో కౌంటింగ్ నిర్వహించి, ప్రతి రౌండ్‌లో ఎనిమిది వార్డుల చొప్పున లెక్కింపు పూర్తి చేయనున్నారు మొదటి రౌండ్‌లో వార్డులు 1, 4, 7, 10, 13, 16, 19, 22; రెండవ రౌండ్‌లో 2, 5, 8, 11, 14, 17, 20, 23; మూడవ రౌండ్‌లో 3, 6, 9, 12, 15, 18, 21, 24 వార్డుల ఓట్ల లెక్కింపు జరుగుతుంది. కౌంటింగ్ కేంద్రాలకు అభ్యర్థులు మరియు వారి ఏజెంట్లు రిటర్నింగ్ ఆఫీసర్ జారీ చేసిన ఐడీ కార్డులతో మాత్రమే ప్రవేశించగలరు. సెల్‌ఫోన్లు, వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్, తినుబండారాలు, పెన్నులు తదితర వస్తువులకు అనుమతి ఉండదని తెలిపారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య సూచించారు.

# ఓట్ల లెక్కింపుకు కట్టుదిట్టమైన మూడంచెల భద్రత

**విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదు**

**అధికారులు నిర్దేశించే తేదీల్లోనే విజయోత్సవాలకు అనుమతి**

**5 మున్సిపాలిటీల కౌంటింగ్ కేంద్రాల వద్ద 850 మంది**

**పోలీసులతో కట్టుదిట్టమైన భారీ భద్రత**

**కౌంటింగ్ కేంద్రాల వెలుపల**

**163 బిఎన్ఎస్ (144 సెక్షన్) అమలు**



జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి (ఫైల్)

**వనపర్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని, కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన మూడంచెల భారీ భద్రతా ఏర్పాట్లు అమల్లో ఉన్నట్లు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. శుక్రవారం రోజు వనపర్తి జిల్లా పరిధిలోని వనపర్తి, కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత, పెబ్బేరు, మున్సిపాలిటిలలో కౌంటింగ్ కేంద్రాల వద్ద 850 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన మూడంచల భారీ భద్రత ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించేందుకు అనుమతి లేదని, సంబంధిత అధికారులు నిర్దేశించే తేదీల్లో మాత్రమే విజయోత్సవాలు జరుపుకోవాలి లెక్కింపు కేంద్రాల వద్ద శాంతిభద్రతలు కాపాడేందుకు, ఎలాంటి అసాంఘిక చర్యలు చోటుచేసుకోకుండా చూసేందుకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు, కౌంటింగ్ కేంద్రాల వెలుపల 163బిఎన్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని. లెక్కింపు కేంద్రాల పరిసరాల్లో భద్రత కోసం ప్రత్యేక బందోబస్తు, క్యూ.ఆర్.టి టీంలు, డాగ్ స్క్వాడ్ టీమ్స్, బాంబు డిస్పోసల్ టీమ్స్, స్ట్రైకింగ్ ఫోర్సులు సిద్ధంగా ఉంచామని. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎస్పీ ప్రజలకు, అభ్యర్థులకు, గెలిచిన వారిని ఉద్దేశించి ముఖ్య సూచనలు జారీ చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పనిసరిగా పాటించాలి. ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, డీజేలు, టపాకాయలు కాల్చటం, ఊరేగింపులకు ఎలాంటి అనుమతి లేదు. శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలు పూర్తిగా నిషేధం. జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని, గొడవలు అల్లర్లు సృష్టించే వారిని, నిబంధనలకు విరుద్ధంగా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించే వారిపై రిమాండ్ లోకి తీసుకోవలసి ఉంటుందని తెలిపారు. ర్యాలీలు లేదా ఊరేగింపులు నిర్వహించుట కొరకు సంబంధిత అధికారుల ఉత్తర్వుల మేరకు వారు నిర్దేశించిన తేదీల్లో మాత్రమే జరుపుకోవాలి. ఎవరైనా నియమావళిని ఉల్లంఘిస్తే, లేదా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే, వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు చట్టాన్ని గౌరవించి, శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని, అలాగే, ప్రజలందరూ శాంతి, సామరస్య వాతావరణాన్ని కాపాడాలని, ఫలితాలను పరస్పర గౌరవంతో స్వీకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులకు మాదిరి ఎన్నికలు నిర్వహణ

**నారాయణపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణంలోని శ్రీ హంసవాహిని ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు మాక్ ఎలక్షన్స్ మాదిరి ఎన్నికలు నిర్వహించారు. రాజ్యాంగంలో పేర్కొన్న ఎన్నికల విధానంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశంలో జరిగే ఎన్నికల ప్రక్రియను క్లుప్తంగా వివరించి, నామినేషన్ నుండి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశను విద్యార్థులతో అనుభవాత్మకంగా నిర్వహింపజేశారు. టెన్త్ తరగతి విద్యార్థులు ఎల్లప్ప, మహేష్, అరవింద్, కీర్తి, నందిని పోటీపడ్డారు. గుర్తుల కేటాయింపు, ప్రచారం, పోలింగ్, ఓట్ల లెక్కింపు తదితర కార్యక్రమాలను విద్యార్థులే స్వయంగా నిర్వహించారు. ఈ పోటీలో ఎల్లప్ప అత్యధిక మెజార్టీతో గెలుపొందారు విద్యార్థులు మాట్లాడుతూ ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలను గమనించిన అనుభవంతో ఈ మాక్ ఎలక్షన్స్‌లో పాల్గొనడం ద్వారా ఎన్నికలపై స్పష్టమైన అవగాహన కలిగిందన్నారు. భవిష్యత్‌లో ఓటు వేయడం, ఎన్నికల్లో పోటీ చేయడం వంటి విషయాలపై స్పష్టత వచ్చిందని తెలిపారు చీఫ్ ఎన్నికల అధికారిగా ఉదయ్, రిటర్నింగ్ అధికారిగా నవిత, పోలింగ్ అధికారిగా శిరీష వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజేష్ కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు నమ్రత, అమల, విజయ, షమీనా, సౌజన్య, ఉషారాణి పాల్గొన్నారు.



విద్యార్థులకు మాదిరి ఎన్నికలు నిర్వహిస్తున్న దృశ్యం

## గూడు లేని ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు

**ఏఎంసీ ఛైర్మన్ రాంపురం శివారెడ్డి**

**నారాయణపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో గూడు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసీ ఛైర్మన్ రాంపురం శివారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి కృషితో నారాయణపేట నియోజకవర్గంలో ఇప్పటివరకు 3500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని పేర్కొన్నారు. అప్పక్‌పల్లి గ్రామంలో మౌలాలి షమీ బేగం నిర్మించుకున్న కొత్త ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు చిట్టెం మాధవ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ శరణప్ప, పేరపల్లి శంకర్, ఆంజనేయులు, అశోక్ రెడ్డి, మల్ల రెడ్డి, కంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మొదటి విడతలో కేటాయించిన ఇళ్ల నిర్మాణాన్ని మార్చి నెలలోగా పూర్తి చేయాలని సూచించారు. ఏప్రిల్ నెల నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ ప్రారంభమవుతుందని తెలిపారు. నిరుపేదలందరికీ గృహసౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న దృశ్యం

## టెట్ క్వాలిఫై మార్కుల సవరణ చేయాలి

**పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేంద్ర సాగర్**



**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌లో క్వాలిఫయింగ్ మార్కులు కేటగిరి వైజ్ గా ఎస్సీ, ఎస్టీలకు 40% బీసీలకు 50% ఓసీలకు 60% ఉండడంతో అనేకమంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులతో పాటు నిరుద్యోగులు కూడా ఇబ్బంది పడుతున్నారు అని అందుకే టెట్ క్వాలిఫై మార్కులు తగ్గించాలని పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేంద్ర సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో క్వాలిఫయింగ్ మార్కుల పర్సంటేజ్ ను తగ్గిస్తున్నారు అని కోర్టు తీర్పు ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నందున, మన రాష్ట్రంలో కూడా టెట్ అర్హత మార్కులు తగ్గించాలని ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు అయినప్పటికీ నిరుద్యోగులకైనా లాభం జరుగుతుందని, ఈ విషయం లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి ఉపాధ్యాయులలో ఉన్న ఆందోళనను తగ్గించాలని పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేంద్ర సాగర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

## క్రీడల్లో రాణించాలి..

**పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి శ్రీనివాస్**

**హర్యానాకు తరలిన పియు జట్టుకు అభినందన**

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ నిర్వహించే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్లో భాగంగా పాలమూరు విశ్వవిద్యాలయం పురుషుల క్రాస్ కంట్రీ జట్టు హర్యానాలోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ రోహ్తక్‌లో ఈనెల 14 నుండి 16వరకు జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ క్రాస్ కంట్రీ మెన్ చాంపియన్షిప్‌లో పాల్గొననున్నది. ఈ సందర్భంగా పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ॥ జిఎన్. శ్రీనివాస్ క్రీడాకారులకు ట్రాక్ షూట్, టీం యూనిఫామ్ ను అందించారు. ఈ సందర్భంగా పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి మాట్లాడుతూ క్రీడాకారులు పాలమూరు విశ్వవిద్యాలయంలో ఉన్నటువంటి క్రీడా సదుపాయాలను ఉపయోగించుకొని క్రీడల్లో ఉన్నతంగా రాణిస్తూ పాలమూరు విశ్వవిద్యాలయానికి మంచి పేరు ప్రఖ్యాతలను తీసుకురావాలని ఆకాంక్షించారు. పాలమూరు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.రమేష్ బాబు, పాలమూరు విశ్వవిద్యాలయం ఫిజికల్ డైరెక్టర్ డా. వై. శ్రీనివాసులు, కోచ్ జె.కథలప్ప, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ వెంకట్ రెడ్డిలతో పాటు ఎంపికైన క్రీడాకారులు పాల్గొన్నారు.



వీసీ శ్రీనివాస్‌తో క్రీడాకారులు

**సేవాలాల్ బంజారా ప్రీమియం**

## లీగ్ సీజన్ 4 విజేత ఏడుగుట్టల తాండ

**బాలానగర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** బాలానగర్ మండల పరిధిలోని పెద్దాయపల్లి చౌరస్తా సమీపంలో గత 10 రోజులుగా సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా.. బంజారా ప్రీమియర్ లీగ్ సీజన్ 4 ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలు ఈరోజుతో ముగిసాయి. ఈ పోటీల్లో మొదటి బహుమతి మండలంలోని ఏడు గుట్టల తండా గెలవగా, రెండవ బహుమతి పెద్దబాయి తాండ గెలుచుకుంది. గెలుపొందిన జట్లకు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చేతుల మీదుగా ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఆర్గనైజర్స్ జాలుగడ్డ సర్పంచి రాములు నాయక్, అరుణ్ నాయక్, రవి నాయక్ లను అభినందించారు. ఇలాంటి పోటీలు నిర్వహించి బంజారా యువకులలోని ప్రతిభను వెలికి తీసేందుకు వీరు చేసే ప్రయత్నాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.




## ఉప్పునుంతలలో క్రీడా ప్రాంగణానికి మంత్రి గ్రీన్ సిగ్నల్

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల లో క్రీడా ప్రాంగణం నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తానని మంత్రి వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. మండల స్థాయిలో నిర్మించే క్రీడా ప్రాంగణానికి ప్రభుత్వ స్థలాన్ని అధికారులు నాయకులు సమన్వయంతో గుర్తిస్తే సత్వరమే నిర్మాణ పనుల కోసం నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అచ్చంపేట పట్టణంలో గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన మంత్రి వాకిటి శ్రీహరికి గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కు వినతి పత్రం సమర్పించారు. దీంతో స్పందించిన మంత్రి సత్వరమే భూమి సేకరణ చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సూచనల మేరకు మండల నాయకులు కృషి చేయాలని సూచించారు. మంత్రికి వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మెడమోని భాస్కర్, యూత్ కాంగ్రెస్ ఇంఛార్జి అంతటి శేఖర్ గౌడ్, కట్ట శ్రీనివాస్ రెడ్డిలు ఉన్నారు.



క్రీడా ప్రాంగణం కోసం మంత్రికి వినతి పత్రం అందజేత

## లేబర్ కోడ్లను రద్దు చేసి,కార్మిక చట్టాలను అమలు చేయాలి

**బాలానగర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక చట్టాలను సవరించి, నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం కార్మికులను బానిసత్వంలోకి నెట్టడమే అవుతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు దీప్లా నాయక్ అన్నారు. బిజెపి ప్రభుత్వం అత్యంత ప్రమాదకరమైన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను అమలు చేయడం కార్మిక వర్గంపై యుద్ధం చేయడమేనని, పారిశ్రామిక రంగాన్ని దివాలా తీయించడానికి కార్మికుల్ని కట్టు బానిసలుగా మార్చడానికి పెట్టుబడిదారులకు ప్రయోజనం కలిగించే విధంగా కార్మిక చట్టాలను మార్చడం జరిగింది అన్నారు. జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని మార్చి ఈ బీజీ రాంజీ చట్టాన్ని ప్రతిపాదించడం, విత్తన సవరణ బిల్లును ఉపసంహరించుకొని రైతాంగానికి ఎం ఎస్ పి కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థలన్నీ, బ్యాంకులు, ఎల్ఐసి, రైల్వే, బీమా సంస్థలు, బీహెచ్ఈఎల్, బిడిఎల్ తదితర కేంద్ర ప్రభుత్వ సంస్థలను కాపాడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లైన అంగన్‌వాడి, ఆశ, మధ్యాహ్నం భోజనం కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు సావిత్రి, అంగనవాడి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కమల, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు మణెమ్మ, వివిధ రంగాల నాయకులు సుజాత, సునీత, అమృత, అలివేలు, గౌస్య బేగం, బాలకృష్ణ, కృష్ణయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు దీప్లా నాయక్

## నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలి

**చిన్నచింతకుంట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కే.సూర్యం డిమాండ్ చేశారు. గురువారం కేంద్రకార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు దేశవ్యాప్తసార్వత్రిక సమ్మె సందర్భంగా మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం నుంచి సిఐటియు ,టియుసిఐ, ఏఐటీయూసి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్మికులు, అంగన్‌వాడి, ఆశ వర్కర్లు, గ్రామపంచాయతీ కార్మికులు, బీడీ కార్మికులు పాల్గొన్నారు. ఈ సమ్మెలో ముఖ్యఅతిథిగా టియుసిఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యం హాజరై ప్రసంగిస్తూ కేంద్రంలో నరేంద్ర మోడీ తీసుకొచ్చిన నాలుగు కోడ్స్ రద్దు చేయాలని విద్యుత్ బిల్లు సవరణకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులందరని రెగ్యులరైజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు పీఎఫ్ ,ఈఎస్ఐ అమలు చేసి సకా లంలో వేతనాలు ఇవ్వాలన్నారు. జీవో 51ని రద్దు చేసి కనీస వేతనం రూ.26వేలు గా నిర్ణయించాలని ఆయన డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్మికులు అతి తక్కువ జీతాలకే పరిమి తమయ్యారని వారికి స్పెషల్ బెనిఫిట్స్ కల్పిస్తూ వేతనాలు పెంచుతూ పనిగంటలు తగ్గించాలన్నారు. టీయూసీఐ జిల్లా అధ్యక్షులు జె.ఎన్. దేవదానం మాట్లాడుతూ కార్మికులకు అందరికీ ఇన్సూరెన్స్ భద్రతా చట్టాన్ని చేయాలని, కార్మికులకు పని గంటలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు కోళ్ల వెంకటన్న, ఏఐటీయూసీ శ్రీను, భార్గవి లు కార్మికుల ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీసుకొచ్చిన చట్టాలు కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నాయని అందుకు కార్మికులంతా ఐక్యత కలిగి పోరాడాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ టీచర్స్ వారి సమస్యలు చాలా ఉన్నాయని రిస్క్‌తో పని చేయిస్తున్నారని వారి ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ రంగాల కార్మికులు పురవీధుల గుండా ర్యాలీగా తరలివచ్చి బస్టాండ్ కూడలిలో ధర్నా చేపట్టారు అనంతరం సమ్మెను విరమించారు. ఈ కార్యక్రమంలో సెద్రేక్, విన్ను, శ్రీను, లాజర్, కోళ్ల అంజన్న, ఎం.రాజు, చిలకట్టి నరసింహులు, అంగన్‌వాడీ టీచర్స్ జ్యోతి చంద్ర, సువర్ణ, ఆశ వర్కర్ వెంకటమ్మ, శంకరమ్మ. ఆశన్న ,చెన్నప్ప, వెంకటన్న, బీడీ కార్మికులు సత్యమ్మ అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



ర్యాలీ చేపట్టిన కార్మిక సంఘ నేతలు, కార్మికులు

**వార్తా కథనానికి స్పందించిన అధికారులు**

## సమస్యను పరిష్కరించిన అధికారులు

**పంట పొలాలకు ట్రాన్స్ఫార్మర్‌కు ఎలాంటి ఇబ్బంది లేదు.. జిల్లా విద్యుత్ అధికారి డిఈ చంద్రమౌళి**

**నవాబుపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** నిన్న వార్తాపత్రికలో ప్రతిరితమైన కాకర్ల పహాడ్ గ్రామంలో విద్యుత్ అంతరాయ సమస్యతో పంట పొలాలు ఎండుతున్నాయని శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించి కాకర్లపాడు ట్రాన్స్ఫార్మర్ ని పరిశీలించి ఎబి స్విచ్లను విద్యుత్ అధికారులు సమన్వయంతో సరిచేసి రైతులకు పొలాలకు నష్టం జరగకుండా సమస్యలు పరిష్కరించారు. ఏబి స్విచ్ మొదటి నుంచి క్రాస్ ఉండడం వల్ల కానీ ఎలాంటి స్పార్క్ లేదు, ఎలాంటి షార్ట్ సర్క్యూట్ కూడా లేదు మోటర్ ఆల్రెడీ రన్నింగ్‌లోనే ఉందని ఎలాంటి పంట పొలాలు ఎండిపోలేదని అధికారులు గ్రామంలోని ఒక యువకుడు అసత్య ప్రచారం చేశారని ఈ సందర్భంగా ఆయన అక్కడ రైతులకు ఎలాంటి నీటి కొరత లేదు. పక్కనే ఉన్న భాస్కరయ్య అనే రైతు కూడా ఎలాంటి ప్రాబ్లం లేదని చెప్పాడు. సత్యనారాయణ అనే రైతను విద్యుత్ను ప్రభుత్వానికి డిడి చెల్లించకుండా వినియోగించుకోరాదని హెచ్చరించి రెండు మూడు రోజుల్లో డిడి తీసుకొని విద్యుత్ వాడుకోవాలని సత్యనారాయణ రైతును హెచ్చరించారు. ప్రభుత్వాధికారులపై ఎలాంటి తప్పుడు ఆరోపణలు చేయొద్దని వారు మాట్లాడారు. ఏదైనా సమస్య ఉంటే అధికారులకు లేదా గ్రామ అధికారులకు తెలియజేయాలని, ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్ అధికారి డి.చంద్రమౌళితోపాటు ఏడీఈ నవీన్ కుమార్, నవాబుపేట ఏఈ సంతోష్ జూనియర్ లైన్మెన్ నర్సింలు, గ్రామ సర్పంచ్ బాలయ్య డిప్యూటీ సర్పంచ్ అంబేద్కర్, గ్రామ ప్రజా ప్రతినిధులు సమీప రైతులు పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు : జిల్లా ఎస్పీ

**నారాయణపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల, పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ డా.వినీత్ గురువారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచల భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పేట, మక్తల్, కోస్గి, మద్దూర్ మున్సిపాలిటీల కౌన్సిలర్ల ఓట్ల లెక్కింపు సందర్భంగా నాలుగు కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 550 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద సీసీ కెమెరాలు, ఆర్మ్డ్ పోలీస్, సివిల్ పోలీసులతో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు అనుమతి లేని వ్యక్తులను కౌంటింగ్ కేంద్రాలకు అనుమతించబోమని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు పూర్తిగా నిషేధమని వెల్లడించారు ఎన్నికలకోడ్ అమల్లోఉన్నందున విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. సెక్షన్ 30పోలీస్‌యాక్ట్, 163 పిఎన్ఎస్ఎస్ 144 సిఆర్‌పిసి అమల్లో ఉన్నందున గుంపులుగా గుమికూడరాదని హెచ్చరించారు. మోడల్ కోడ్ ముగిసిన తర్వాత మాత్రమే పోలీసుల అనుమతితో ర్యాలీలు నిర్వహించుకోవాలని సూచించారు లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా జరిగేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజలు, అభ్యర్థులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ శివశంకర్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, నరేష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లూరు రిజర్వాయర్‌లో చేపలు పట్టే హక్కును తమకు కల్పించాలి

**మంత్రి శ్రీహరిని కోరిన మత్స్యకారులు**

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ఎల్లూరు రిజర్వాయర్‌లో చేపలు పట్టే హక్కును తమకు కల్పించాలని మత్స్యకారులు రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకారం శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. గురువారం అచ్చంపేట మండలంలోని చంద్రసాగర్ వద్ద ఏర్పాటుచేసిన మత్స్యకారుల సమావేశానికి హాజరైన మంత్రి కి ఎల్లూరు పరిసర గ్రామాలైన నార్లాపూర్, కుడికిళ్ల, మొలచింతపల్లి, పెద్దకోత్తపల్లి మండలం మారెడుమాన్ దిన్నె గ్రామాల మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల మత్స్యకారులు తమ సమస్యను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. గత ప్రభుత్వంలో తమకు మాత్రమే చేపలు పట్టుకునేందుకు అధికారం ఉందని, కొంత మంది ఇతర కులస్తులు మత్స్య కార్మి కులకు చేపలు పట్టే అధికారం లేదని తమను అడ్డుకుంటున్నారని, కుల వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న మాకు చేపలు పట్టుకుని జీవనం సాగించే విధంగా హక్కు కల్పించగలరని కోరారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి సమస్యలు ఉన్నాయని త్వరలోనే ప్రభుత్వంతో మాట్లాడి పూర్తి హక్కులు కల్పించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మారేడు మాన్ దీన్నె మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు పెబ్బేటి రేణయ్య, చిన్న నరసింహా, శ్రీను, సందు సత్యం, జగన్, నారాయణ, ఎల్లయ్య, వెంకట్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి వాకిటి శ్రీహరికి వినతి పత్రం అందజేస్తున్న మత్స్యకారులు

## బాధ్యత కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**జడ్చర్ల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డులో అనారోగ్యంతో మృతి చెందిన కొంగలి లక్ష్మయ్య( చిన్న) మృతికి శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్‌రెడ్డి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆదేశం మేరకు 26వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకుడు తుంగ రఘు వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి రూపాయలు ఐదువేల ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్తులో ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు వారి కుటుంబ సభ్యులకు అందే విధంగా చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు పెద్దలు మాజీ ఎస్ఫై నర్సిములు, రవీందర్, వెళ్లి వారి కుటుంబ సభ్యులు పరామర్శించారు.

## నేటి నుంచి ఎస్‌జిఎఫ్ క్రికెట్ పోటీలు

**జడ్చర్లలో వసతి ఏర్పాట్లను పరిశీలించిన ఎంఈఓ మంజుల**



క్రీడాకారులకు వసతి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** నేటి నుంచి ఎస్ జిఎఫ్ అండర్ 17 (బాలుర) రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానున్నది. ఈటోర్నమెంట్‌ను జడ్చర్ల మినీ స్టేడియం, స్వామి నారాయణ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్ జడ్పీహెచ్ ఎస్ బాయ్స్ బాదేపల్లి గ్రౌండ్‌లలో నిర్వహిస్తున్నామని ఎస్‌జిఎఫ్ కార్యదర్శి డా. ఆర్ శారదాబాయి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వస్తున్న క్రీడాకారులకు వసతికోసం ప్రేరణ బ్రిలియంట్, సెయింట్ పాల్స్ స్కూల్‌లలో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంఈఓ మంజులాదేవి క్రీడా ప్రాంగణాలను సందర్శించారు. కార్యక్రమం లో వ్యాయామ ఉపాధ్యాయులు రాములు పీడీ, మొయిన్ పీడీ పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి



**బిజినేపల్లి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** విద్యుత్ షాక్ తగిలి బాలుడు మృతి చెందిన సంఘటన వెలుగొండ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామపంచాయతీలో స్వీపర్ పనిచేసే శశికళ కుమారుడు గుంత ఉపేందర్ (15) నూతనంగా నిర్మించుకున్న ఇంటి వద్ద నీటిని పట్టే క్రమంలో మోటారుకున్నా పైపు ఊడిపోయినట్లు తెలిపారు. పైపును సరి చేసే క్రమంలో విద్యుత్ షాక్కు గురై అక్కడికక్కడే ఉపేందర్ మృతి చెందినట్లు వివరించారు. శశికళ భర్త రాములు మృతి చెందిన సంఘటన మరొక ముందే కొడుకు ఉపేందర్ మృతి ఘటన ఆ కుటుంబాన్ని కన్నీటి సంద్రంలోకి నెట్టింది. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న ఉపేందర్ మృతి చెందడంతో తల్లి, తమ్ముడి రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## శివ స్వాములకు పండ్ల పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

**బిజినపల్లి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** పాలెం వ్యవసాయ కళాశాల సోషల్ యాక్టివిటీ క్లబ్ ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల మూడవ సంవత్సరం విద్యార్థులు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీశైలం మహా క్షేత్రానికి పాదయాత్రగా వెళ్తున్న శివ స్వాములకు పండ్లు నీరు పంపిణీ చేశారు. భక్తులకు మూడు రోజుల పాటు పండ్లు, తాగునీరు, అల్పాహారాన్ని పంపిణీ చేశారు. భక్తులకు ఎండలో ఉపశమనం కలిగించేలా విద్యార్థులు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టి సేవాభావాన్ని చాటుకున్నారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతను గుర్తుంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అధ్యాపకులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కళాశాల విద్యార్థుల సామాజిక సేవా స్ఫూర్తి ప్రతిఫలించింది.

## ఘనంగా జ్యోతిర్లింగాల మహా పడిపూజ



పడిపూజలో పాల్గొన్న స్వాములు

**రాజాపూర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** మాల ధారణలతో మనసు ప్రశాంతంగా ఉంటుందని, శివ స్వాముల దీక్ష క్రమబద్ధమైన జీవన విధానం నేర్పే భక్తి మార్గమని కాంగ్రెస్ పార్టీ నాయకులు సుజయ్ చంద్రారెడ్డి అన్నారు. మాల ధారణ ధరించిన భక్తులు క్రమశిక్షణ వైపు, ఆధ్యాత్మిక మార్గంతో భక్తి పారవశ్యంతో స్వామివారిని కొలుస్తారని అన్నారు. శివ గురుస్వాములు లాలు గురుస్వామి, శివ గురు స్వామి, శేఖర్ గురు స్వాముల ఆధ్వర్యంలో నిర్వహించిన ద్వాదశ జ్యోతిర్లింగాల మహా పడిపూజ, జ్యోతిర్ముడుల పూజా కార్యక్రమానికి సుజయ్ చంద్రారెడ్డి తన వంతుగా సహకారం అందజేసినట్లు తెలిపారు. జ్యోతిర్లింగాల మహా పడిపూజకు పడిని సమకూర్చిన సుజయ్ చంద్రారెడ్డిని శివస్వాములు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ పూజా ఈ కార్యక్రమంలో పలువురు శివ స్వాములు, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

## పెద్దాయపల్లిలో ఉచిత మెడికల్ హెల్త్ క్యాంప్

**బాలానగర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెద్దాయపల్లి గ్రామ పంచాయతీలోపెద్దాయపల్లి సర్పంచ్ బి.గాయత్రి లక్ష్మయ్య ఆధ్వర్యంలో శ్రీదత్త హాస్పిటల్ ఉచిత మెడికల్ హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహించారు. డా. మౌనిక ఎంబిబిఎస్ సహకారంతో ఉచితంగా 110 కి హెల్త్ చెకప్ చేసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ బి.గాయత్రి లక్ష్మయ్య, గ్రామ ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు, డ్రైనేజీ పనులు ప్రారంభం



**కృష్ణ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** మండల అభివృద్ధికి స్థానిక ప్రజలు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. మండల కేంద్రంలోని కృష్ణ గ్రామంలోని 8వ వార్డు కు గాను ఎస్సీ సబ్ ప్లాన్ కింద సీసీ రోడ్డుకు రూ.5 లక్షలు డ్రైనేజీకు రూ.3 లక్షలు మంజూరైన నిధులతో సీసీ రోడ్, డ్రైనేజీ పనులను స్థానిక నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సర్ఫరాజ్, సర్పంచ్ ఎస్.నగేష్ , ఉప సర్పంచ్ రేష్మ, 8వ వార్డు సభ్యురాలునౌషాద్ బాను, ఇతర వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి నర్సింహ, కాంట్రాక్టర్, స్థానికులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలి

**రాజాపూర్, ఫిబ్రవరి12 ప్రభాతవార్త:** ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ గురువారం రాజాపూర్ మండల కేంద్రంలో ఆటోయూనియన్ ఆధ్వర్యంలో బందుకు పిలుపు నిచ్చారు. ఆటో నడిపిస్తేనే తమకు పొట్ట గడుస్తుందని, తమను ఆదుకుం టామని హామీ ఇచ్చిన ప్రభుత్వం నేడు ఇచ్చిన హామీని మరిచిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు.

## లేబర్ కోడ్స్ రద్దుకై పోరాడుతూనే ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుందని డిమాండ్ చేశారు. ఇది రాజ్యాంగంలోని ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీస్తే రాజ్యాంగ వ్యతిరేక చర్య అంతర్జాతీయ కార్మిక సంస్థ ఐఎల్ఓ సిఫార్సులను పూజిక పులాల తీసేసి బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడి సాధించుకున్న ట్రేడ్ యూనియన్ చట్టం 1926 ప్రకారం యూనియన్ల ఏర్పాటు కార్మికుల హక్కుగా పొందారు, అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమ్మెకు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్యఏఐటియుసి జిల్లా అధ్యక్షులుభాగీ కృష్ణయ్య అధ్యక్షులుగా వ్యవహరించారు. వారు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాల్సిన బాధ్యత నుండి యజమాన్యాలు చట్టబద్ధంగా తప్పించుకునేందుకు పలు మార్గాలను సృష్టించాయి ,కనీస వేతనాలకు బదులుగా ఫ్లోర్ లెవెల్ కనీస వేతనం అమలు చేయనున్నట్లు లేబర్ కోడ్లో పేర్కొన్నారు. కనీస వేతనాలు నిర్ణయానికి ఇప్పటివరకు ఉన్న డాక్టర్అక్రాయిడ్ సిఫార్సులు1957 ఇండియన్ లేబర్ ఇన్సూరెన్స్ సిఫార్సులు 1992 నాటి లాప్టాప్స్ బ్రేక్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు కిలోధకాలు ఇచ్చారు. ఈ కోడ్ లో కనీస వేతనం నిర్వచనం లేదు వేతనాలు ఎలా నిర్ణయిస్తారో చెప్పలేదు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేషనల్ ఫ్లోర్ లెవెల్ వేతనం రోజుకు 178 రూపాయలుఇవ్వాలని నెలకు 4628/ఇరవై మాత్రమే ఇవ్వాలని పేర్కొన్నారు. ఇది అమలు అయితే ప్రస్తుతం కార్మికులు పొందే వేతనాల్లో భారీ కోతలు తప్పవు. కార్మికులు జీవించడం గగనంగా మారుతున్నది ఎన్ని పని గంటలు ఉండాలో ఎప్పుడు విరామం తీసుకోవాలో ఎంత స్ప్రెట్ ఓవర్ టైం ఉండాలో ప్రభుత్వమే నిర్ణయిస్తుందనిపేర్కొన్నారు. మేడే స్ఫూర్తితో 1927లో సాధించుకున్న 8 గంటల పని దినం ఈరోజు మోడీ ప్రభుత్వం దాన్ని తుంగలో తొక్కిందని వాళ్ళు ఆవేద వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రాష్ట్ర కార్యదర్శి ఆకుల వెంకటేష్ సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు భాగీ కృష్ణయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జగన్ అంగన్‌వాడి అధ్యక్షురాలు ప్రభావతి లీలావతి మధ్యాహ్న భోజనంఅధ్యక్షురాలు కౌశల్య పద్మ ఆశవర్కర్స్ అధ్యక్షురాలు సరోజ సుగుణ లారీ అసోసియేషన్ అధ్యక్షులు కలీం భాష, టాక్సీ కార్ అసోసియేషన్ అధ్యక్షులు పర్వతాలు రాజేందర్‌గౌడ్‌గ్రామ పంచాయతీ వర్కర్స్ అధ్యక్షులు పాషా శేఖర్ రెడ్డి ఎండి మున్నా, ఇందిరా, కృష్ణ, మహేష్, యాదయ్య, రాజశేఖర్ రెడ్డి, చెన్నయ్య, సాదిక్, మహమూద్, కవిత, అనసూయ, రాజేశ్వరి, మహేశ్వరి, విమల పాల్గొన్నారు.

## ఉప్పునుంతలలో ఘనంగా శివ స్వాముల ఇరుముడి కార్యక్రమం

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతల శ్రీకేదారేశ్వర ఆలయ ప్రాంగణంలో గురువారం శివ స్వాముల ఇరుముడి కార్యక్రమం జరిగింది. గురు స్వాములు గంధం వెంకట్ రాములు, కదిరే బక్కయ్య ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమం జరిగింది. అనంతరం శివ స్వాములు ఊరేగింపు గా గ్రామంలో తిరిగి అనంతరం శ్రీశైలం వరకు పాదయాత్ర చేపట్టారు. ఇరుముడి కార్యక్రమానికి శివ స్వాముల కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సర్పంచును సన్మానించిన మంత్రి

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** మండలంలోని కంసానిపల్లి గ్రామ సర్పంచ్ చీమర్ల లలిత వెంకటేశ్వర్లు ను రాష్ట్ర పశు సంవర్ధక శాఖ , మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఘనంగా సన్మానించారు. గురువారం చంద్ర సాగర్‌లో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం అభివృద్ధి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సమక్షంలో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ముదిరాజ్ సోదరులు సర్పంచులుగా ఎంపికైన వారిని ఘనంగా శాలువాలు కప్పి సన్మానించారు. మండలంలోని కంసానిపల్లి గ్రామం చెందిన ముదిరాజు సోదరి మణి సర్పంచ్‌గా ఎంపిక కావడంతో హర్షించదగ్గ విషయమని రాజకీయంగా ముదిరాజ్ సోదరులు అభివృద్ధి చెందాలని ,రాష్ట్ర ప్రభుత్వం రాజకీయంగా ప్రత్యేక స్థానం కల్పించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి

◆ సిఐటియు రాష్ట్ర కార్యదర్శి రమేష్



అచ్చంపేటలో సార్వత్రిక సమ్మెకు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం కార్మిక, వ్యతిరేక కార్పొరేట్‌కు అనుకూల విధానాలను ఉపసంహరించుకోవాలని కార్మిక వర్గం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూర్పాటి రమేష్ పిలుపునిచ్చారు. గురువారం సార్వత్రిక సమ్మెలో భాగంగా అచ్చంపేట పట్టణంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పట్టణంలోని పటేల్ ఫంక్షన్ హాల్ లో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన సభకు ఎం శంకర్ నాయక అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభకు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాలలో కూలీలకు ఉపాధి నిచ్చే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్‌ల అమలుతో దేశంలో 40కోట్ల సంఘటిత, అసంఘటిత కార్మికులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. కార్మికుల ఐక్యతకోసం ఇచ్చిన దాని కోసమే పెట్టుబడిదారులకు యజమానులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని, వాటిని తిప్పి కొట్టే వరకు కార్మిక వర్గం కేంద్ర ప్రభుత్వంపై ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేశ్యా నాయక్, వ్యవసాయ కార్మిక సంఘంజిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్, నాగరాజు, సిఐటియు సహాయ కార్యదర్శి శంకర్ నాయక్, సైదులు, అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ జిల్లాఅధ్యక్షురాలు పార్వతమ్మ, మంజుల, శాంతమ్మ, సృజన, జయప్రద, భారతి, కార్యదర్శి అలివేల, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సయ్యద్, ఎస్ డబ్ల్యూ ఎఫ్ఆర్‌టిసి నాయకులు వెంకటయ్య, కేశవులు, చందు, గోపాల్, సిఐటియు పట్టణకార్యదర్శి రాములు, శివరాములు ఆశావర్కర్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్, మార్కెట్ హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల వ్యతిరేక విధానాలను విడాలి

◆ సిఐటియు మండల కార్యదర్శి ఎం.వెంకటేష్



నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు

**చిన్నంబావి, ఫిబ్రవరి12 ప్రభాతవార్త:** కార్మికుల హక్కులను కాలరాస్తున్న బిజెపి విధానాలను అడ్డుకుందామని సిఐటియు మండల కార్యదర్శి ఎం. వెంకటేష్ అన్నారు. దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాల సమ్మెలో భాగంగా చిన్నంబావి మండల కేంద్రంలో సిఐటియు, టియుసిఐ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీనిర్వహించి నిరసన వ్యక్తం చేయడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాల సవరణ ద్వారా భారత రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి అంశాలను ధ్వంసం చేసేందుకు బిజెపి చేస్తున్న కుటిల యత్నాలను కార్మిక వర్గం ఐక్యంగా ఉండి అడ్డుకోవాలన్నారు. కార్మికులకు సంఘాలు ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ లేకుండా, కనీస వేతనాలు పొందే ఆర్థిక సమానత్వం లేకుండా, ప్రజల మధ్య సౌభ్రాతృత వాతావరణం లేకుండా బిజెపి చేస్తున్న రాజ్యాంగ వ్యతిరేక చట్టాలను వ్యతిరేకించాలని కోరారు. కార్మిక వర్గ హక్కులను కాలరాస్తూ దేశాన్ని దేశ సంపదను విదేశీ పెట్టుబడిదారులకు అప్పచెబుతున్నారని విమర్శించారు. సులభతర వాణిజ్యం పేరుతో భారతదేశ శ్రమజీవులను కార్పొరేట్ శక్తులకు బానిసలుగా మార్చే బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలన్నారు. నాడు సామ్రాజ్యవాదులతో పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేయడం అన్యాయం అన్నారు. కేంద్ర కార్మిక సంఘాలతో కనీసం చర్చలు చేయకుండా సమిష్టి భాగస్వామ్యం లేకుండా ఏకపక్షంగా కార్మికచట్టాలనురద్దుచేసి రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని భంగం కలిగించే చర్యలుతీసుకుందన్నారు. ఒకవైపు కార్మిక చట్టాలను రద్దుచేసి, మరోవైపు దేశ రైతాంగాన్ని కార్పొరేటీకరణ శక్తులకు అప్పజెప్పేందుకు జాతీయ విత్తన సవరణ, విద్యుత్ సవరణ బిల్లులను తీసుకొచ్చారని విమర్శించారు .దేశభక్తి, ధర్మం ముసుగులో కార్మికుల సంపద అయిన ప్రభుత్వ రంగ సంస్థలను, విదేశీ కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నారని విమర్శించారు. గ్రామీణ ప్రజల ఉపాధికి గండి కొట్టే విధంగా తీసుకొచ్చిన వివిజిరాంజీ బిల్లును తీసుకొచ్చి ప్రజల జీవన ప్రమాణాలు తగ్గించే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను యధాతథంగా కొనసాగించాలని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కాంట్రాక్ట్ అండ్ అవుట్సోర్సింగ్ వ్యవస్థను రద్దుచేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రతి కార్మికుడికి కనీస వేతనం 26,000 ఇవ్వాలని గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, ఉపాధి కూలీలకు కనీస కూలి రూ.600 ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, జాతీయ విత్తన, విద్యుత్ బిల్లులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గం ఐక్య ప్రతిఘటన పోరాటాల ద్వారా భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అక్తర్ పాషా, టియుసిఐ నాయకులు, అంగన్‌వాడి గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్ చట్టాలను ఉపసంహరించుకోవాలి



డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**నర్వ, ఫిబ్రవరి12 ప్రభాతవార్త :** కార్మికుల హక్కులను కాలరాస్తూ ప్రభుత్వం తీసుకు వస్తున్న నాలుగు లేబర్ కోడ్ చట్టాలను ఉపసంహరించుకోవాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సలీం, సిఐటియు జిల్లా నాయకులు యు.మహేందర్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం నర్వ మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో కార్మికులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సంధర్భంగా సలీమ్, యం.మహేందర్ లు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు కార్పొరేట్ ప్రైవేట్ కంపెనీలకే అనుకూలంగా చట్టాలు చేస్తూన్నారన్నారు. ప్రశ్నిస్తే ఎన్నోరకాల ఇబ్బందులకు గురిచేయడం జరుగుతుందన్నారు. దేశంలో ఉన్నా అసంగటిత కార్మికులకు నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.28 వేలు ఇవ్వాలన్నారు. 8 గంటల పని దినం స్థానంలో 12 గంటల పని చేయాలని తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్ నల్ల చట్టాలు ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం ఎంజిఎన్ఆర్ఈజీఏ యాక్ట్ చట్టమే ఉండాలనీ, దాని ప్రకారమే కూలిరేట్లు మూడు వందల రూపాయల నుండి ఎనిమిది వందల రూపాయల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులు పొందే వరకు పోరాటాలు అగవని అందుకు కార్మిక లోకం మద్దతు చాల అవసరం అన్నారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాసులుకు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ఆశాకు పలురకాల డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్య క్రమంలో కార్మిక సంఘం జిల్లా నాయకులు రామకృష్ణ, భాస్కర్, కార్మిక సంఘంనర్వ మండల అధ్యక్షులు శ్రీను, కార్యదర్శి నర్సింహులు మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల కార్మికులు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపుకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)





కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

చెల్లిన ఓట్లను మాత్రమే సంబంధిత అభ్యర్థి గుర్తు ఉన్న బాక్సుల్లో వేయాలని సూచించారు. చెల్లని ఓట్లను గుర్తించి ప్రకటించే పూర్తి బాధ్యత రిటర్నింగ్ అధికారులదేనని స్పష్టం చేశారు. మొత్తం కౌంటింగ్ ప్రక్రియ ఎన్నికల నిబంధనలకు లోబడి, పారదర్శకంగా సాగాలని ఆదేశించారు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో 8 టేబుళ్ల ఏర్పాటు చేసి, ప్రతి టేబుల్‌కు ముగ్గురు చొప్పున మొత్తం 24 మంది కౌంటింగ్ అధికారులు విధులు నిర్వహించనున్నారు. ఒక్కో రౌండ్‌లో 8 వార్డుల చొప్పున లెక్కింపు జరిపి, మొత్తం 3 రౌండ్లలో పూర్తిస్థాయి ఫలితాలు ప్రకటించనున్నట్లు తెలిపారు. కల్వకుర్తిలో 8 టేబుళ్ల ఏర్పాటు చేసి 24 మంది అధికారులు, కొల్లాపూర్‌లో 7 టేబుళ్ల ఏర్పాటు చేసి 21 మంది అధికారులు కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు మొత్తం ఉన్నతాధికారుల పర్యవేక్షణలో జరుగుతుందని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, మూడంచెల భద్రత కల్పించడం, స్ట్రాంగ్ రూముల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. స్ట్రాంగ్ రూములను కూడా తనిఖీ చేసి భద్రతా ఏర్పాట్లను సమీక్షి ంచినట్లు చెప్పారు. అభ్యర్థులు మరియు వారి ఏజెంట్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఏవైనా అభ్యంతరాలు లేదా సందేహాలు తలెత్తిన పక్షంలో వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఓట్ల లెక్కింపును ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియను నిష్పాక్షంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ దేవ సహాయం, డిప్యూటీ సీఈవో గోపాల్ నాయక్, నాగర్‌కర్నూల్ ఆర్డీవో సురేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తహసీల్దార్ తబితా రాణి పాల్గొన్నారు.

# రూ.20కోట్లతో పట్టణాభివృద్ధి కార్యక్రమానికి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



పట్టణంలో సిసి రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే వంశీకృష్ణ

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** రూ. 20 కోట్ల వ్యయంతో మున్సిపాలిటీ వారి పరిధిలో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు గురు వారం రాష్ట్ర పశుసంవర్ధక, రాష్ట్ర క్రీడలు యువజన, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. 8 కోట్లతో రాజీవ్, ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి శంకుస్థాపన, మూడు కోట్ల వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణం, మున్సిపాలిటీ బిల్డింగు కోటి రూపాయలు, శనగకుంట దాదాపుగా 1కోటి 78సుందరీకరణ పనులు, రాజీవ్ నగర్ కాలనీలో 1 కోటి48 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగాఆయా కార్యక్రమాల్లో మాట్లాడుతూ అచ్చంపేట ప్రాంతాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, ఎమ్మెల్యే సూచనల మేరకు పట్టణాభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్, ఆర్‌డిఓ యాదగిరి, తహసీల్దార్ సైదులు గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గంగాపురం రాజేందర్, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, అచ్చంపేట డిఎస్పీ పల్లె శ్రీనివాసులు, అచ్చంపేట సీఐ నాగరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు సునీత, గోపిశెట్టి శివ, పదర మాజీ జెడ్పిటిసి రాంబాబు నాయక్, వివిధ గ్రామాల పార్టీ కార్యకర్తలు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 22వ డివిజన్ రిజల్ట్‌పై ఆసక్తి..

◆ ఓవైపు ఎంపీ డీకే అరుణ, మరోవైపు ఏపీ జితేందర్ రెడ్డి

◆ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి ఓటు ఉన్నది ఇక్కడే

◆ కాంగ్రెస్ బిజెపి మధ్య పోటీ ..? ◆ ఉత్కంఠ పోరులో నెగ్గేదెవరు..



22వ డివిజన్‌లో పోటీ పడుతున్న బిజెపి, కాంగ్రెస్ పార్టీలు

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. వైపు మేయర్ పీఠం పై ఆశావహుల ఎదురుచూపులు, మరో వైపు ప్రముఖుల ఫలితాలపై ఆసక్తి నెలకొన్నది. 22వ డివిజన్‌లో కూడా అదే చర్చ జరుగుతున్నది. 22వ డివిజన్ జనరల్ వుమెన్ కు రిజర్వ్ కావడంతో మూడు ప్రధాన పార్టీల నుంచి మహిళా అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి ప్రవీణ, బిఆర్ఎస్ నుంచి ప్రతిభ, బిజెపి నుంచి మర్రిజ్యోతి పోటీలో ఉన్నారు. ఈ డివిజన్లో సుమారు 2370 ఓట్లు ఉండగా 61శాతం పోలింగ్ నమోదు అయింది. ఈ నేపథ్యంలో సుమారు 600 నుంచి 650 లోపు ఎవరుఓట్లు సంపాదించిన గెలుపొందే అవకాశాలు పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తుంది. 22వ డివిజన్లో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి నివాసం ఇక్కడే ఉండడం, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి కూడా ఇక్కడే ఓటు హక్కు ఉండడంతో సర్వత్రా చర్చనీయాంశం అయింది. ఎవరు గెలుస్తారనే ఉత్కంఠ నెలకొన్నది. మొన్నటిదాకా కాంగ్రెస్ అభ్యర్థి మెజార్టీతో గెలుపొందుతారు అంటూ పెద్ద ఎత్తున ప్రచారం కొనసాగగా, పోలింగ్ డే రోజు మాత్రం అందుకు భిన్నంగా చర్చలు జరిగినట్లు సమాచారం. సైలెంట్ ఓటింగ్‌బిజెపి అభ్యర్థిపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున గెలుపు బాటలో తాము కూడా ఉన్నట్లు చర్చలు బాహాటంగానే వినిపించాయి. ఈ వార్డులో బిఆర్ఎస్ ప్రభావం అంతాగా ఉండక పోవచ్చు అని స్థానికులు చర్చించుకుంటున్నారు. దీంతో ప్రధానంగా బిజెపి కాంగ్రెస్ మధ్య పోటీ ఉన్నట్లు తెలుస్తున్నది. మరి కొన్ని గంటల్లోనే ఈ ఉత్కంఠకు తెర వీడనున్నది.



మార్నింగ్ వాక్‌లో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

## క్రీడలతో ప్రపంచ స్థాయి గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యేగోపాల్పేట మండల కేంద్రంలోనిబాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పరిశీలించారు. సన్నబియ్యంతో వండిన అన్నంతో పాటు, పప్పు కూరగాయలను, రాగిజావను ఆయన చూశారు. విద్యార్థులకు తయారుచేసే భోజనం పట్ల అశ్రద్ధ వహించరాదని, ఎప్పటికప్పుడు తాజా కూరగాయలతో నాణ్యవంతమైన భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలని ఆయన అధికారులకు, పాఠశాలఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యాభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో మార్పులను తీసుకువచ్చిందని విద్యా వ్యవస్థను బలోపేతంచేసి తెలంగాణకు బంగారు భవిష్యత్తును అందించేందుకు ముందుకెళుతున్నట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపు పారదర్శకంగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం పోలింగ్ కేంద్రాలవారిగా, వార్డుల వారీగా బ్యాలెట్ బాక్సులను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరవాలని తెలిపారు. ప్రతి 25 ఓట్లను ఒక కట్టగా తయారు చేసి లెక్కించాలని సూచించారు. చెల్లిన ఓట్లను మాత్రమే సంబంధిత అభ్యర్థి గుర్తు ఉన్న బాక్సుల్లో వేయాలని, చెల్లని ఓట్లనుగుర్తించి ప్రకటించే పూర్తి బాధ్యత రిటర్నింగ్ అధికారులదేనని స్పష్టం చేశారు. మొత్తం కౌంటింగ్ ప్రక్రియ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు లోబడి పారదర్శకంగా కొనసాగాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, మూడంచెల భద్రత కల్పించినట్లు తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా అభ్యర్థులకు, వారి ఏజెంట్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఏవైనా అభ్యంతరాలు లేదా సందేహాలు తలెత్తిన పక్షంలో వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఓట్ల లెక్కింపును ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటుస్థానిక సంస్థల అదనపుకలెక్టర్ శివేంద్ర ప్రతాప్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్‌రెడ్డి, ఆర్‌డిఓ నవీన్, డి పిఓ వెంకట్ రెడ్డి, డిఇఓ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్లు, మాస్టర్ ట్రైనర్లు బాలు యాదవ్ బైకాని శ్రీకాంత్, నాగరాజ్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల నిఘాలో కౌంటింగ్

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు తగు నిర్ణయంతీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ సీసీ కెమెరాల నిఘాలో జరుగుతుందని ఎలాంటి తప్పిదాలకు చోటు లేకుండా జాగ్రత్తగా లెక్కింపు చేయాల్సి ఉంటుందన్నారు. ఆయా వార్డు స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లను నిబంధనలను అనుసరించి కౌంటింగ్ హాల్స్‌లోకి అనుమతించాలని, వారికి గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ జరిగేలా శాంతి భద్రతలు కాపాడేందుకు అవసరమైన పోలీసు బందోబస్తు నియమిస్తామని, అధికారులు కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి మున్సి పల్ ఎన్నికలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్‌కౌంటింగ్ హాల్స్ లో ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగుసూచనలు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్‌సాగర్, శిక్షకులు, ఇతరఅధికారులు పాల్గొన్నారు.

## మంత్రికి ఘన స్వాగతం

**ఉప్పునుంతల, ఫిబ్రవరి12 ప్రభాతవార్త:** చంద్ర సాగర్‌లో జరిగిన సమావేశానికి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖ, క్రీడల మంత్రి ముఖ్య అతిథిగా హాజరు కావడంతో ముదిరాజ్ సోదరులు సాంప్రదాయ పద్ధతిలో వలకప్పి, చేపలను అందజేసిఘనంగా సన్మానించారు. సర్పంచులను సన్మానించిన మంత్రి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీఎన్నికల్లో గెలుపొందినముదిరాజ్ సోదరులు ఎంపికైన గ్రామ సర్పంచులను మంత్రి, ఎమ్మెల్యే శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు

## నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టిన సర్పంచ్

**నవాబుపేట, ఫిబ్రవరి12 ప్రభాతవార్త:** నవాబుపేటలో మిషన్ భగీరథ నీళ్ల అంతంత మాత్రంగానే వస్తుండడంతో మూడవ వార్డులో నీటికొరత ఏర్ప డింది. వార్డు ప్రజలు సర్పంచ్‌దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి రాబో యేది ఎండాకాలం కాబట్టి ముందు జాగ్రత్తగా మంచినీటి బోరు వేయించారు. అందులో దాదాపు మూడు ఇంచుల నీళ్లురావడంతో కాలనీ వాసులకు నీటి తిప్పలుతప్పడంతో హర్షంవ్యక్తం చేశారు. కార్యక్రమంలో సుధాకర్‌చారి, వార్డుసభ్యులు మండే శ్రీనివాసులు, ముష్టి గోపాల్ గ్రామస్తులు ఉన్నారు.